# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 37 | విశాఖపట్నం | 7-11-2025 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 37 | VISAKHAPATNAM | 7-11-2025 FRIDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు


9516171797, 9849349934


## చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో

# డేటా ఆధారిత పాలనపై సదస్సు

**అమరావతి, డెక్కన్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో డేటా ఆధారిత పాలనపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు మంత్రులు, కార్యదర్శులు, హెచ్ఓడీలు హాజరయ్యారు. జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు వీడియో కాన్ఫరెన్సు ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని పౌరులకు సుపరిపాలన అందించాలని సూచించారు. కూటమి ప్రభుత్వ లక్ష్యం కూడా అదేనని ఆయన అన్నారు. అందుకు అనుగుణంగానే విజన్ ప్రణాళికలను రూపొందించినట్లు వెల్లడించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నదే అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రాధాన్యత కావాలని వ్యాఖ్యానించారు. గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్‌గా మార్చుకుని సమర్థంగా ఆ విభాగాన్ని వినియోగించుకుందామని పిలుపునిచ్చారు. అంతా కలిసికట్టుగా పనిచేసి ఇటీవల వచ్చిన తుఫాన్‌ను సాంకేతిక వినియోగంతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని బాగా తగ్గించగలిగినట్లు వెల్లడించారు. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసి ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగామని అన్నారు.డేటా ఆధారిత పాలన అనేది ఇప్పుడు అత్యంత కీలకమైన అంశంగా మారిందని ముఖ్యమంత్రి అన్నారు. క్వాంటం కంప్యూటర్‌ను వచ్చే జనవరి నుంచే అమరావతిలో ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. సీఎఫ్ఎంఎస్ వ్యవస్థ ద్వారా సమర్థంగా వనరులను వినియోగించగలుగుతున్నామని అన్నారు. గత ప్రభుత్వ చేసిన విధ్వంసాన్ని చక్కదిద్దుతూ ఉన్న సమస్యల్ని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని అన్నారు.


2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. నెలలవారీ, త్రైమాసిక లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ఫలితాలను



సాధించాలని సూచించారు. నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగానే ప్రభుత్వం పౌరసేవలు అందించాల్సి ఉందని అన్నారు. ప్రతీ నియోజకవర్గానికీ ఓ సీనియర్ అధికారి నేతృత్వంలో టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేసి విజన్ ప్లాన్ అమలు చేస్తామని వెల్లడించారు. ఆర్టీజీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి ఆయా శాఖలకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. అందుకు అనుగుణంగానే నిర్ణయాలు వేగంగా తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు.

## ఇకపై గ్రామ సచివాలయాల పేరు

# విజన్ యూనిట్స్: చంద్రబాబు




**అమరావతి, డెక్కన్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ సచివాలయాలకు కొత్త పేరు పెట్టే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. ఇకపై వాటిని "విజన్ యూనిట్స్"గా పిలవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంత్రులు, అధికారుల సమీక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు గురువారం కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "గ్రామ సచివాలయాల వ్యవస్థ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించే విధంగా రూపకల్పన చేయాలి. అందుకే వాటిని విజన్ యూనిట్స్‌గా మార్చుతున్నాం. ఇవి భవిష్యత్తులో ప్రజా సేవలకు కేంద్ర బిందువుగా నిలుస్తాయి" అని చెప్పారు. ఇకపై ఈ విజన్ యూనిట్స్ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను వేగంగా, సమర్థంగా అందించేందుకు ప్రత్యేక సాంకేతిక పద్ధతులను ప్రవేశపెట్టనున్నాం. పౌరులకు అవసరమైన సంక్షేమ పథకాలు, రికార్డులు, సర్టిఫికేట్లు, ప్రభుత్వ సహాయ పథకాలను ఇలా అన్నీ ఒకే వేదికపై అందించే విధంగా ఈ యూనిట్స్ పని చేయనున్నాయి. ఈ విజన్ యూనిట్స్ రాష్ట్ర భవిష్యత్ పరిపాలనలో కూడా కీలక పాత్ర పోషిస్తాయని, గ్రామస్థాయి పాలనను ఆధునిక సాంకేతికతతో మిళితం చేస్తామన్నారు.



## గిరిజన, గురుకుల, ఆశ్రమ పాఠశాలల గోడు వినరా!

5లో

# పత్తి రైతులను ఆదుకోండి

### కేంద్రానికి మంత్రి అచ్చెన్నాయుడు లేఖ



**అమరావతి, పతాకం న్యూస్:** పత్తి రైతుల సమస్యలపై కేంద్ర టెక్స్టైల్ మంత్రి గిరిరాజ్ సింగ్ కు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు లేఖ రాశారు. ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పత్తి పంట తీవ్రంగా దెబ్బతిన్నదని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. రైతులు ప్రస్తుతం కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరలకు పత్తిని విక్రయించాల్సి వస్తోందని అచ్చెన్నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 2025%-%26 ఖరీఫ్ సీజన్‌లో 4.56 లక్షల హెక్టార్లలో పత్తి సాగు జరుగుతుందని, దాదాపు 8 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి (తరువాయి 2వ పేజీలో)



## చేనేతకు చేయూత ఏదీ?

7లో



2లో

## రాష్ట్రాన్ని గంజాయి రహితంగా మార్చాం : హోంమంత్రి అనిత




## 14, 15 తేదీల్లో విశాఖలో సీఐఐ సదస్సు

# భారీగా ఏర్పాట్లు

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రపంచస్థాయి సీఐఐ భాగస్వామ్య సదస్సుకు విశాఖపట్నం అత్యంత సుందరంగా ముస్తాబవుతోంది. ఈ నెల 14, 15వ తేదీల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ మైదానంలో జరగనున్న ఈ సదస్సుకు ఏర్పాట్లు శర వేగంగా జరుగుతున్నాయి. 40 దేశాల నుంచి 3000 మంది ప్రతినిధులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ప్రధాన వేదికతోపాటు, ప్రత్యేక ప్రాంగణాలు సిద్ధం చేస్తున్నారు. సీఎం చంద్రబాబుతోపాటు గవర్నర్, ఉప రాష్ట్రపతి ఈ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలు ఉండడంతో భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో 13 ఎకరాల్లో ఈ సదస్సుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడే దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులు ప్రభుత్వంతో 410 ఒప్పందాలు చేసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు సుమారు రూ.9.80 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అదే సమయంలో రూ.2.70 లక్షల కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టులకు సీఎం చంద్రబాబు శంకుస్థాపనలు చేయనున్నారు. సదస్సు నేపథ్యంలో నవంబరు 13వ తేదీనే సీఎం చంద్రబాబు విశాఖ చేరుకోనున్నారు. వచ్చే అతిథులకు ఆ రోజు రాత్రి నోవోటెల్ హోటల్‌లో విందు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. దేశ, విదేశాలకు చెందిన రాయబారులు, కాన్సుల్ జనరళ్లు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పారిశ్రామిక దిగ్గజాలు, వ్యాపార రంగ ప్రముఖులు, అతిథుల కోసం నగరంలోని 26 హోటళ్లలో 1,200 గదులు సిద్ధం చేశారు. దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులు పర్యాటక ప్రదేశాలను వీక్షించే అవకాశం ఉండడంతో విందు ఏర్పాటుచేసి, అక్కడ వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు.


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..

అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..

పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

### సైనిక బలాన్ని పెంచుకుంటున్న సామ్రాజ్యవాద దేశాలు

ఈ ఏడాది జూన్ నెలలో నెదర్లాండ్స్ దేశంలోని హేగ్ నగరంలో నాటో దేశాల శిఖరాగ్ర సమావేశం జరిగింది. సైనిక వ్యయాలను తమ జిడిపి లో కనీసం 5 శాతానికి తగ్గకుండా ఉండేలా 2035 నాటికి పెంచాలని అక్కడ అన్ని సభ్యదేశాలూ ఒక అంగీకారానికి వచ్చాయి. ప్రస్తుతం అమెరికా సైనిక వ్యయం ఆ దేశపు జిడిపిలో 3.5 శాతం ఉంది. యూరోపియన్ యూనియన్ (ఇ.యు) సైనిక వ్యయం 1.9 శాతం ఉంది. అంటే, రానున్న రోజుల్లో అమెరికా, ఇ.యు దేశాలు తమ సైనిక వ్యయాన్ని గణనీయంగా పెంచబోతున్నాయన్న మాట. ఇక జపాన్ సైనిక వ్యయం ఆ దేశపు జిడిపిలో ఒక శాతానికి మించకుండా గతంలో ఆంక్షలు ఉండేవి. వాటిని క్రమంగా జపాన్ ఉల్లంఘిస్తూ వచ్చింది. తాజాగా ప్రధాని బాధ్యత తీసుకున్న సానే తకైచీ తమ సైనిక వ్యయాన్ని ఇప్పుడున్న 1.8 శాతం నుండి 2 శాతానికి పెంచనున్నట్టు ప్రకటించారు. సామ్రాజ్యవాద దేశాలన్నీ ఈ విధంగా కూడబలుక్కుని తమ సైనిక వ్యయాలను పెంచడానికి పూనుకోవడం సైనికీకరణ వేగం పుంజుకోడానికి దారి తీస్తుంది. ఇది ఒక కొత్త పరిణామం. తమ సైనికీకరణ వేగాన్ని పెంచుకోడాన్ని సమర్ధించుకుంటూ నానా రకాల వాదనలనూ ముందుకు తెస్తున్నారు. ముఖ్యంగా రష్యా నుండి ప్రమాదం పొంచివుందన్న వాదన చేస్తున్నారు. రష్యా తన సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు పూనుకుందని, ఉక్రెయిన్ ను ఆక్రమించుకోడానికి సాగిస్తున్న యుద్ధం అందులో భాగమేనని సామ్రాజ్యవాదుల ప్రచార సాధనాలు కోడై కూస్తున్నాయి. నిజానికి విస్తరణకు ప్రయత్నాలను ప్రారంభించినదే సామ్రాజ్యవాద కూటమి. గతంలో రష్యా అధ్యక్షుడు గోర్బచేవ్ కు క్లింటన్ ప్రభుత్వం ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తూ రష్యా సరిహద్దు వరకూ ఉన్న దేశాలన్నింటికీ నాటో సభ్యత్వాన్ని ఇచ్చి రష్యాను సైనికపరంగా చుట్టుముట్టింది సామ్రాజ్యవాదులే. ఆ సమయంలో మిన్స్క్ లో జరిగిన సమావేశంలో ఉక్రెయిన్, రష్యా దేశాలు తమ ఉభయుల మధ్యా ఎటువంటి సైనిక ఘర్షణా ఉండకూడదని ఒప్పందం చేసుకోడానికి సిద్ధపడ్డాయి. అప్పటి బ్రిటిష్ ప్రధాని బోరిస్ జాన్సన్ పనిగట్టుకుని ఉక్రెయిన్ రాజధాని కీవ్ కు పయనమై అటువంటి ఒప్పందం చేసుకోవద్దని ఉక్రెయిన్ ను వెనక్కి లాగాడు. ఆ ఒప్పందమే గనుక జరిగివుంటే ఇప్పుడు ఉక్రెయిన్, రష్యాలు ఇలా యుద్ధంలో చిక్కుకునేవే కావు. ఇదంతా సామ్రాజ్యవాదుల కుట్ర. ఎవరు విస్తరణ కాంక్షతో వ్యవహరిస్తున్నారో దీనిని బట్టే అర్ధం అవుతోంది. తమ యుద్ధ కాంక్షలను సమర్ధించుకోడానికే ఇప్పుడు వాళ్ళు రష్యా బూచిని సాకుగా చూపిస్తున్నారు. ఇటువంటి ప్రచారాన్ని యూరప్‌లో ఎవరైనా ప్రశ్నిస్తే వెంటనే వాళ్ళని రష్యన్ ఏజంట్లుగా, పుతిన్ కు తాబేదార్లుగా చిత్రిస్తున్నారు. సహ్రా వేజెన్‌నెక్ట్ జర్మనీలో వామపక్ష నాయకురాలు. డై లింక్ అనే పార్టీ నుండి విడగొట్టుకుని ఇటీవల వేరే పార్టీని ప్రారంభించారు. యూరప్ దేశాల భద్రత రష్యాతో స్నేహం ద్వారా మాత్రమే సాధ్యం అని, రష్యా దురాక్రమణదారు కాదని ఆమె ప్రకటించారు. దాంతో ఆమెను జర్మన్ మీడియా యావత్తూ రష్యన్ ఏజంటుగా ముద్ర వేసి దాడి చేస్తోంది.నిజానికి యూరప్ దేశాలు రష్యా పట్ల కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తోంది. రష్యాపై సామ్రాజ్యవాద దేశాలు విధించిన ఆంక్షల ఫలితంగా ఈ దేశాలు అంతవరకూ చౌకగా రష్యా నుంచి వచ్చే చమురు బదులు ఎక్కువ ఖరీదైన అమెరికన్ చమురును బలవంతాన కొనుగోలు చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. దాని వలన యూరప్ దేశాల్లో జీవన వ్యయం బాగా పెరిగిపోయింది. కార్మిక వర్గాన్ని అది మరిన్ని భారాల వైపు నెట్టింది. పైగా జర్మనీ వంటి దేశాలు తయారు చేసే ఉత్పత్తుల ఖరీదు పెరిగిపోయింది. ఆ సరుకులు అంతర్జాతీయ పోటీలో నిలబడలేని పరిస్థితి ఏర్పడింది. దానివలన జర్మనీలో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితి వచ్చింది. ఉన్న పరిశ్రమలే మూతవేసుకోవలసిన పరిస్థితి వచ్చింది. ఈ ఆంక్షల వలన అమెరికా తన చమురును మరింత ఎక్కువగా యూరప్‌కు అమ్ముకోగలిగింది. కాని యూరప్ దేశాలకు నష్టమే కలిగింది. అయినప్పటికీ అవి తమ స్వంత ప్రయోజనాలను బలి చేసుకుంటూ అమెరికా ఆంక్షలను వ్యతిరేకించకుండా పూర్తిగా లొంగిపోవడం విచిత్రం.

## నెల్లూరు జిల్లాలో రోడ్డు ప్రమాదం
## ఆటో, కారు ఢీకొని 16 మందికి గాయాలు



**నెల్లూరు, పతాకం న్యూస్:** నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం మోచెర్ల వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటో, కారు ఢీకొని 16మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఉలవపాడు, కావలి ఆస్పత్రులకు తరలించారు. మోచెర్ల వద్ద జాతీయ రహదారిపై ఉన్న పెట్రోల్ బంకులో ఆయిల్ నింపుకుని జాతీయ రహదారిపైకి వచ్చిన ఆటో రోడ్డును దాటుతున్న సమయంలో కారు ఢీకొట్టింది. గాయపడిన వారందరూ కరెడు పంచాయితీ అలగాయిపాలెం గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. రోడ్డు ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ పెను ప్రమాదం తప్పింది. ఎవరి ప్రాణాలకూ ముప్పులేదని తెలిసింది. వీరంతా మంత్రి లోకేశ్ పర్యటనకు వచ్చిన టీడీపీ కార్యకర్తలు. జాతీయ రహదారి నుంచి తిరుగు ప్రయాణంలో అప్పి ఆటోలో వెళ్తున్న 12 మంది మహిళలు ఒక డ్రైవర్?కు గాయాలు అయ్యాయి. అందులో నలుగురు మహిళలకు తీవ్ర గాయాలుకాగా వీరిని ఉలవపాడు, కావలి ఆసుపత్రులకు చికిత్స కోసం 108 అంబులెన్స్?లో తరలించారు. అలాగే అప్పి ఆటోను ఢీకొన్న కారులో ముగ్గురికి గాయాలు అయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. ప్రమాదంలో కారు, అప్పి ఆటో నుజ్జు నుజ్జు అయ్యాయి. రోడ్డు ప్రమాద ఘటనపై మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన పర్యటనకు వచ్చి వెళ్తుండగా గాయపడటం బాధాకరమన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఉలవపాడు, కావలి ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న కార్యకర్తలను పరామర్శించేందుకు టీడీపీ నేతలను పంపించారు. కార్యకర్తలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## బీహార్‌లో ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగితే ఎన్‌డిఏ కుప్పకూలుతుంది: ప్రియాంకగాంధీ




**పాట్నా, పతాకం న్యూస్:** బీహార్ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగితే, ఎన్‌డిఏ ప్రభుత్వం కుప్పకూలుతుందని కాంగ్రెస్‌నేత ప్రియాంకగాంధీ వ్యాఖ్యానించారు. గురువారం ఆమె బీహార్‌లో ఎన్నికల ర్యాలీ చేపట్టారు. దేశ అభివృద్ధికి అపారమైన కృషి చేసిన బీహార్ ప్రజల పట్ల ఎన్‌డిఏ ప్రభుత్వానికి గౌరవం లేదని అన్నారు. అభివృద్ధి పేరుతో కాకుండా మతం పేరుతో ఎన్‌డిఏకు ఓట్లు వేయాలని బిజెపి నేతలు ప్రజలను డిమాండ్ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగితే, ఎన్‌డిఏ ప్రభుత్వం కూలిపోతుందని అన్నారు. పేదలు, మహిళలు, యువత కోసం పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు ఓటు వేస్తారని అన్నారు. బీహార్‌లో గత మూడేళ్లలో 27 బ్రిడ్జీలు కూలిపోయాయని, ఎన్‌డిఏ ప్రభుత్వంలో మౌలికసదుపాయాల అభివృద్ధి కుంటుపడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పత్తి రైతులను ఆదుకోండి
### (మొదటిపేజీ తరువాయి)

అంచనా ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సిఎం యాప్, ఆధార్ ఆధారిత ఈ-పంట వ్యవస్థ ద్వారా పత్తి కొనుగోళ్లను డిజిటల్ రూపంలోనే నిర్వహిస్తోంది. అయితే, కేంద్రం ప్రవేశపెట్టిన కాపాస్ కిసాన్ యాప్ ను రాష్ట్ర సిఎం యాప్ తో అనుసంధానం చేసిన తరువాత సాంకేతిక సమస్యలు తలెత్తి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అచ్చెన్నాయుడు కేంద్ర మంత్రికి రాసిన లేఖలో వివరించారు. రైతుల వివరాలు కాపాస్ కిసాన్ యాప్ నుండి సిఎం యాప్ కు రియల్ టైమ్‌లో సమన్వయం అయ్యేలా చర్యలు తీసుకోవాలి అని సూచించారు. ఇక, రైతులు సమీప జిల్లాల్లోని జిన్నింగ్ మిల్లుల్లోనే తాము పండించిన పత్తిని విక్రయం చేసుకునేలా మ్యాపింగ్ చేయాలని, దూరప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా చూడాలని కోరారు. L1, L2, L3 జిన్నింగ్ మిల్లులను ఒకేసారి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే, కాపాస్ కిసాన్ యాప్ నిర్వహణ కోసం గుంటూరులో ప్రత్యేక సాంకేతిక సిబ్బంది నియామకం అవసరమని సూచించారు. వాతావరణ ప్రభావంతో తేమ శాతం 12-18 శాతం ఉన్న పత్తిని అనుపాత తగ్గింపులతో కొనుగోలు చేయాలని, అలాగే వర్షానికి తడిసిన లేదా రంగు మారిన పత్తికి తగిన ధర చెల్లించాలని లేఖలో పేర్కొన్నారు. ఈ చర్యలు రైతుల అసంతృప్తిని తగ్గించి, వారికి ఆర్థిక భరోసా కల్పిస్తాయని అచ్చెన్నాయుడు నమ్మకం వ్యక్తం చేశారు. చివరగా, సహజ విపత్తుతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కేంద్రం తక్షణ సహకారం అందించాలని అచ్చెన్నాయుడు లేఖలో విజ్ఞప్తి చేశారు.

## రెండో రోజు కూడా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ తనిఖీలు



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎసిబి తనిఖీలు నిర్వహిస్తోంది. గత రెండు రోజులుగా కార్యాలయాల్లో అధికారులు పలు డాక్యుమెంట్లను పరిశీలించారు. బుధవారం 12 ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. గురువారం కూడా తనిఖీ కొనసాగుతోంది. డాక్యుమెంట్ రైటర్ల నుండి నగదు పంపిణీ అవుతోందని ఎసిబి గుర్తించింది. కొన్ని కార్యాలయాల్లో లెక్క చూపని నగదు ఉన్నట్లు అధికారులు తెలిపారు. రూ.4 లక్షల నగదు, కొన్ని డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు.

## రాష్ట్రాన్ని గంజాయి రహితంగా మార్చాం : హోంమంత్రి అనిత



**అమరావతి, పతాకం న్యూస్:** వైఎస్సార్సీపీ నేతల వెంట తమ పిల్లల్ని పంపించే విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తం కావాలని హెూంమంత్రి అనిత పిలుపునిచ్చారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయిని వ్యాప్తి చేయాలని చూస్తున్న వైఎస్సార్సీపీ వెంట విద్యార్థులు, యువత తిరగకుండా చూసుకోవాలని సూచించారు. మంగళగిరిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. డ్రగ్స్ వద్దు బ్రో అని ప్రభుత్వం అంటుంటే జగన్ నేతృత్వంలో వైఎస్సార్సీపీ ఇంకా డ్రగ్స్ తీసుకో బ్రో అని ప్రోత్సహిస్తోందని ధ్వజమెత్తారు. విద్యార్థులు, యువత జీవితాల్ని నాశనం చేయడానికి జగన్ కంకణం కట్టుకున్నారని దుయ్యబట్టారు. తన ధన దాహంతో విద్యార్థుల భవిష్యత్‌ను తుంచేయాలని జగన్ చూస్తున్నారని మండిపడ్డారు. డ్రగ్స్ కేసులో వైఎస్సార్సీపీ నేత కొండారెడ్డి అడ్డంగా దొరికితే, జగన్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు సిగ్గుపడాలని విమర్శించారు. కొండారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయకుండా విద్యార్థి విభాగానికి జగన్ సమావేశాలు పెడుతుండటాన్ని ఎలా చూడాలని నిలదీశారు. ఏ ముఖం పెట్టుకుని విద్యార్థి విభాగాలకు జగన్ శిక్షణా కార్యక్రమాలు పెడుతున్నారని అనిత ప్రశ్నించారు. గంజాయి, డ్రగ్స్‌కు తన పూర్తి మద్దతు ఉందని పులివెందుల ఎమ్మెల్యే చెప్తున్నారా? అని నిలదీశారు. గంజాయి, డ్రగ్స్ అంటూ విద్యార్థుల భవిష్యత్ నాశనం చేసేందుకు పులివెందుల జగన్ కుట్రల్ని ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని తేల్చిచెప్పారు. డ్రగ్స్ వద్దు బ్రో నినాదాన్ని ప్రభుత్వం పాఠశాల స్థాయికి తీసుకెళ్లి చైతన్యం తీసుకొస్తోందని వెల్లడించారు. రాష్ట్రంలో డ్రగ్స్ లేకుండా చూసేందుకు లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని అనిత తెలిపారు. డ్రగ్స్?కు కేంద్రంగా చేసేందుకే జగన్ విశాఖను రాజధాని చేస్తా అన్నారా? అని ఆక్షేపించారు. ఆడబిడ్డల్ని కించపరిచే విధంగా సాక్షి మీడియాలో ప్రచారం చేసే కథనాలు దుర్మార్గమని మండిపడ్డారు. ఆడబిడ్డలపై తప్పుడు రాతలు రాసే వారిపై కేసులు నమోదు చేస్తామని హెూంమంత్రి హెచ్చరించారు. ఏపీలో ఈగల్ వ్యవస్థను స్థాపించాక ఏడాదిన్నరలో గంజాయిగా లేకుండా చేశామని హెూంమంత్రి అనిత తెలిపారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే నినాదాన్ని పాఠశాల స్థాయి వరకూ తీసుకెళ్తున్నట్లు చెప్పారు. గతంలో గంజాయికి బానిసగా మారిన పిల్లలను చూసి తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారని గుర్తుచేశారు. యువత భవిష్యత్తుకు భరోసా కల్పించాలనే ఈగల్ వ్యవస్థను తీసుకొచ్చినట్లు అనిత పేర్కొన్నారు. డ్రగ్స్ వల్ల వచ్చే అనర్థాలు, కేసుల్లో ఇరుక్కుంటే వచ్చే నష్టాలేంటో అవగాహన కల్పిస్తున్నామని అనిత తెలిపారు. యువత భవిష్యత్తుపై మాట్లాడే హక్కు జగన్‌కు లేదన్న అనిత, డ్రగ్స్ దందా చేసిన వాళ్లకు ఆయన ఒత్తాసు పలుకుతున్నారా? అని ప్రశ్నించారు. 2019 నుంచి 24 మధ్య దేశంలో గంజాయి ఎక్కడ దొరికినా దాని మూలాలు ఏపీలో ఉన్నాయని చెప్పుకొనే పరిస్థితి ఉండేదని అన్నారు. అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్‌ది అని దుయ్యబట్టారు. స్కూల్ పిల్లల బ్యాగ్‌ల్లోకి కూడా దాన్ని చేర్చిన ఘనత ఆయనదని, డ్రగ్స్, గంజాయిపై వైఎస్సార్సీపీ హయాంలో ఒక్క సమీక్ష అయినా చేశారా? అని నిలదీశారు. కానీ సీఎం చంద్రబాబు దీని నిర్మూలనకు ఆరుగురు మంత్రులతో ఒక సబ్ కమిటీని ఏర్పాటు చేశారని అనిత గుర్తు చేశారు.

## గాజువాక డంపింగ్ యార్డ్ లో దుర్వాసన లేకుండా చర్యలు చేపట్టండి: పట్టాబిరామ్





**గాజువాక, పతాకం న్యూస్:** జివిఎంసి జోన్-6 పరిధిలో గల గాజువాక డంపింగ్ యార్డ్ లో దుర్వాసన లేకుండా చర్యలు చేపట్టాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ జీవీఎంసీ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన గాజువాక డంపింగ్ యార్డ్ లను 67, 76 వార్డుల కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు లతో కలిసి సందర్శించారు. గాజువాక డంపింగ్ యార్డ్ దుర్వాసనతో వెదజల్లుతున్నందున స్థానికులు విన్నపం మేరకు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కు తెలియపరిచినందున దానిని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ నుండి దుర్వాసన లేకుండా చర్యలు చేపట్టాలని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డ్ నుండి కాపులుప్పాడ డంపింగ్ యార్డ్ కు తరలించాలని అధికారులను ఆదేశించారు. డంపింగ్ యార్డ్ లో ఎందుకు వ్యర్థాలు ఇంకా ఉన్నాయని అధికారులను ఆరా తీయగా! ప్రతిరోజు 3 వాహనాల ద్వారా కాపులుప్పాడ డంపింగ్ యార్డ్ కు వ్యర్థాలను తరలించడం జరుగుతుందని, ఏడాదికి 70 టన్నుల వ్యర్థాలను తరలిస్తున్నామని, దాదాపు 100 టన్నులు ఉత్పత్తి అవుతుందని, 30 టన్నులు నిల్వ ఉంటుందని, అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు అదనంగా చాలా వరకు సిల్ట్ తీయడం జరిగిందని అది డంపింగ్ యార్డ్ లో పేరుకుపోయిందని, పిఎల్ %డ% సి, మెకానికల్ విభాగంతో మాట్లాడి అదనపు వాహనాలను ఏర్పాటు చేసి వారం రోజుల్లో మొత్తం వ్యర్థాలను తరలిస్తామని సహాయ వైద్యాధికారి కిరణ్ కుమార్ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కు తెలిపారు. డంపింగ్ యార్డ్ తరలించేందుకు అవకాశం లేనందున దుర్వాసన వెదజల్లకుండా మార్గాలను అన్వేషించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి, సహాయక వైద్యాధికారి డా.కిరణ్ కుమార్, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శిలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా ఆన్లైన్ లో హాజరు వేయాలి: ఎంపీడీవో



**అడ్డతీగల, పతాకం న్యూస్:** అడ్డతీగల మండలం ఎల్లవరం గ్రామ సచివాలయం కి ఎంపిడిఓ ఎ వి వి కుమార్ సందర్శించడమైనది. ఆ సమయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్, మరియు మహిళా పోలీస్ కార్యాలయంలోయున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి మరియు డిజిటల్ అసిస్టెంట్ మధ్యాహ్నం భోజనంకు వెళ్ళినారు.తదుపరి ఫోన్ చేయగా కార్యాలయమునకు రావడమైనది. గ్రామ సచివాలయంలో నిర్వహించవలసిన 11 రిజిస్టర్లు నిర్వహించబడుటలేదు. ఈ 11 తప్పనిసరిగా అప్డేట్ చేయవలసినదిగా గ్రామ పంచాయతీ సెక్రటరీ కి తెలియజేయడమైనది. గ్రామ పంచాయతీ పరిధిలో అన్ని గ్రామాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రతి రోజు క్లాప్ మిత్రులతో పారిశుధ్యం చేయించి ఆ వివరాలను పి ఆర్ ఐ యాప్ లో నమోదు చెయ్యాలి. అలాగే త్రాగు నీరు ట్యాంకులను ప్రతి రోజు క్లోరినేషన్ చెయ్యడమే కాకుండా ట్యాంక్ క్లీనింగ్ ప్రతి 15 రోజులకు ఒక సారి తప్పనిసరిగా చేయాలి. అవి కూడా పి ఆర్ ఐ యాప్ లో నమోదు చెయ్యాలి. సచివాలయ సిబ్బంది అందరూ ప్రతి రోజు ఉదయం సాయంత్రం ఆన్లైన్ విధానంలో హాజరు తప్పనిసరిగా వెయ్యాలి . లేని పక్షం లో వారిపై చర్యలు తీసుకుంటాము అని హెచ్చరించడమైనది. ప్రస్తుతం సర్వీసులు తప్పనిసరిగా చిన్నపిల్లలకు బయోమెట్రిక్ అప్డేషన్ మరియు కౌసల్యాం అప్డేషన్ మరియు పి4 బంగారు కుటుంబాలకు మార్గదర్శిలను గుర్తించుట, ఇక నుండి ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే తో పాటు వాట్స్ యాప్ గవర్నెన్స్ (మన మిత్ర) అవగాహనా కార్యక్రమాలను గ్రామ పంచాయతీ పరిధిలో అన్ని గ్రామాల యందు తప్పనిసరిగా నిర్వహించవలెను. అందరూ సచివాలయం సిబ్బంది కూడా తప్పనిసరిగా పాల్గొనవలెను.

# చింతపల్లిలో ఎంఎస్ఎంఈ పార్కు



**చింతపల్లి, పతాకం న్యూస్:** చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం వెనుక ఏపీఐఐసీ మైక్రో స్మాల్, మీడియం ఎంటర్ప్రైజెస్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తుందని కలెక్టర్ ఏఎస్ దినేశ్కుమార్ తెలిపారు. ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత రూ.78.3 లక్షల పీఎం జన్మన్ నిధులతో బెన్నవరం నుంచి బొంకమామిడి వరకు 1.5 కిలోమీటర్ల రహదారి నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. అక్కడ చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వెనుకనున్న ఇండస్ట్రియల్ పార్కు, ఆధ్యాత్మిక పర్యాటకం నిర్మాణాలకు ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. అలాగే చుంచుంపూడి గ్రామంలో ఉన్న ఈఎంఆర్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈఎంఆర్ పాఠశాల బేస్ లైన్ పరీక్షలు జరగలేదని విద్యార్థులు చెప్పారు. దీంతో వెంటనే గురుకులం ఓఎస్డీతో ఫోన్లో మాట్లాడి బేస్ లైన్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. మడిగుంట గ్రామంలో పీఎం జన్మన్తో నిర్మంచిన అంగన్వాడీ నూతన భవనాన్ని పరిశీలించారు. భవనానికి విద్యుత్ సదుపాయం కల్పించేందుకు నిధులు సరిపడకపోవడం వలన మండల పరిషత్ నుంచి రూ.50 వేలు సమకూర్చాలని ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మిని ఆదేశించారు. లంబసింగిలో నిర్మిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. డిసెంబరు నాటికి మ్యూజియం పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్, గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బిల్లులు పెండింగ్లో ఉన్నాయని కాంట్రాక్టర్.. కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, పనులు పూర్తి చేస్తే బిల్లులు వెంటనే చెల్లిస్తామని ఆయన చెప్పారు. అనంతరం కలెక్టర్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చింతపల్లిలో ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసేందుకు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వెనుకనున్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయించామన్నారు. అలాగే ఇండస్ట్రియల్ పార్కు పక్కనే ఓంశాంతి నిర్వాహకులు ఆధ్యాత్మిక పర్యాటక ఉద్యానవనం ఏర్పాటు చేసేందుకు 15 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ఆధ్యాత్మిక పర్యాటక ఉద్యానవనంలో ఆధ్యాత్మిక క్షేత్రం, మెడిటేషన్ కేంద్రం, స్కూల్, ఆస్పత్రి ఏర్పాటు చేస్తారన్నారు. అలాగే పీఎం జన్మన్ పథకం ద్వారా నిర్మిస్తున్న భవనాలు, రహదారుల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.శంకరరావు, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, పీఆర్ ప్రాజెక్టు డీఈఈ డి.సురేశ్ రెడ్డి, ఏఈఈ వి.వెంకటేశ్, పీఆర్ ఏఈఈ బాలకిశోర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ గడుతూరి స్వర్ణలత, టీడబ్ల్యూ డిఈఈ రాఘునాథరావునాయుడు, ఏఈఈ యాదకిశోర్, ఎస్ఎంఐ ఏఈఈ లోకేశ్, ఈఎంఆర్ ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం




**గాజువాక, పతాకం న్యూస్:** ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. 61 వ వార్డు మల్కాపురం రెడ్డి వీధి మినీ కళ్యాణ్ మండపం వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసారు. మల్కాపురం సన్ ఫాన్స్ మల్కాపురం సేయింట్ ఆన్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిలుగా ప్రముఖ కాంట్రాక్టర్ స్థానిక నాయకులు కాకి పోలిరెడ్డి, కాకి రమణారెడ్డి ప్రారంభించి, వ్యాధుల పైన అవగాహన చేసుకొని ప్రజలంతా ఏకతాటిపై వచ్చి ఆరోగ్యవంతులుగా తయారవ్వాలని ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి ఇలాంటి కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని స్థానిక నాయకులు కోరారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు : రూరల్ సీఐ రేవతమ్మ



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం రూరల్ సర్కిల్ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు కొత్త పద్ధతుల్లో చర్యలు చేపడుతున్నారు. సిఐ రేవతమ్మ ఆధ్వర్యంలో రూరల్ పోలీసు సిబ్బంది సహకారంతో గురువారం డ్రోన్ సహాయంతో ప్రత్యేక సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లిమెట్ట, గబ్బడ, గురందరపాలెం, ఏటిగైరంపేటతో పాటు పరిసర గ్రామాల్లో డ్రోన్ ద్వారా పర్యవేక్షణ చేపట్టి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవనము, గంజాయి వాడకం వంటి అంశాలను గుర్తించారు. సర్వేలో ఆరుగురు వ్యక్తులు బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తూ పట్టుబడగా, వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సిఐ రేవతమ్మ మాట్లాడుతూ "బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గంజాయి వాడకం వంటి చర్యలు చట్టరీత్యా తీవ్రమైన నేరాలు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలందరూ చట్టాన్ని గౌరవించి, సమాజ శాంతి భద్రతలకు సహకరించాలి," అని అన్నారు. అదనంగా ఆమె పేర్కొంటూ %-% "ప్రజల భద్రత, ప్రశాంతత కోసం పోలీసులు ఎల్లప్పుడూ కృషి చేస్తారు. డ్రోన్ సర్వేలు, ప్రత్యేక నిఘా చర్యలు నిరంతరంగా కొనసాగుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో ఎవరూ చట్టాన్ని ఉల్లంఘించేందుకు వీలు ఇవ్వం," అని స్పష్టం చేశారు.

# పాతమల్లంపేట పంచాయతీలో సిమెంట్ రోడ్డు నిర్మాణం ప్రారంభం



**గొలుగొండ, పతాకం న్యూస్:** గొలుగొండ మండలం పాతమల్లంపేట పంచాయతీ పరిధిలోని అచ్చియ్యపేట గ్రామంలో రూ.4.30 లక్షల రూపాయల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చొరవతో చేపట్టిన ఈ పనులు గ్రామస్థులను ఆనందంలో ముంచెత్తాయి.గ్రామ సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి,వార్డు సభ్యురాలు అడ్డూరి బంగారమ్మలు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు గెడ్డం నానాజీ,యువనేతలు గెడ్డం ఆనంద్,కెల్లా రాజుబాబు,ఇంజనీరింగ్ అసిస్టెంట్ భాస్కర్,టెక్నికల్ అసిస్టెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.స్థానికులు మాట్లాడుతూ చిరకాలంగా రోడ్డు సమస్యతో సతమతమవుతున్నామని, స్పీకర్ అయ్యన్న పాత్రుడు దూరదృష్టితో ఈ రోడ్డు సాకారమైం దని,అయ్యన్నకు, సర్పంచ్ ఆదిలక్ష్మి, టీడీపీ నాయకులుకు కృతజ్ఞతలు' తెలు పుతున్నామని హర్షం వ్యక్తం చేశారు. ఈ రోడ్డు పూర్తయితే గ్రామంలో రవాణా సౌకర్యం మెరుగవుతుందని, విద్యార్థులు, రైతులు, మహిళలు ప్రయోజనం పొందుతారని అంటున్నారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు గ్రామీణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.

# గిరిజనుల జీవితాల్లో వెలుగులు



**అనంతగిరి, పతాకం న్యూస్:** స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా విద్యుత్ వెలుగులు ఎలా ఉంటాయో చూడని మండలంలోని రొంపల్లి పంచాయతీ మారుమూల గూడెం గ్రామస్థులు ఇళ్లల్లో విద్యుత్ కాంతులను తొలిసారి చూశారు. ఈ గ్రామంలో 18 గిరిజన కుటుంబాలు నివాసముంటున్నాయి. ఇప్పటి వరకు కాగడాల వెలుతురులోనే వీరు జీవనం సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీరి సమస్యపై దృష్టి పెట్టింది. ఉపముఖ్యమంత్రి పవన్కల్యాణ్ ఆదేశాల మేరకు గత నెల 11న విద్యుత్ శాఖ ఎస్ఈ జీఎన్ ప్రసాద్, డీఈఈ పి.వేణుగోపాల్, ఏడీ ఆనంద్మురళి ఈ గ్రామాన్ని సందర్శించారు. రూ.80 లక్షల వ్యయంతో తొమ్మిది కిలోమీటర్ల పొడవున 217 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ఈ గ్రామంలోని ప్రతి ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. ప్రతి ఇంటికి 5 బల్బులు, ఒక ఫ్యాన్ వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. దీంతో ఆ గ్రామస్థుల ఆనందానికి అవధుల్లేకుండాపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్కల్యాణ్కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# జడ్డంగిలో వాహన తనిఖీలు



**రాజవొమ్మంగి, పతాకం న్యూస్:** రాజవొమ్మంగి మండలం జడ్డంగి గ్రామంలో ఎస్సై చినబాబు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ వాహన తనిఖీలలో సరైన రికార్డులు లేని మరియు హెల్మెట్ ధరించని వారికి ఫైన్ లు విధించారు. వాహనం నడిపేటప్పుడు వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, వానినికి సంబంధించిన రికార్డులు తెచ్చుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులతో రాకపోకలు సాగించవద్దని ప్రవేటు వాహనదారులకు సూచించారు.

# తాండవ నల్లకొండమ్మ ఆలయం వద్ద కార్తీకమాస వనభోజనాలు



**నాతవరం, పతాకం న్యూస్:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నాతవరం మండల అధికారుల ఆధ్వర్యంలో గురువారం తాండవ నల్లకొండమ్మ ఆలయం వద్ద కార్తీకమాస మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక, భక్తి కార్యక్రమాలతో పాటు పోటీలను కూడా ఏర్పాటు చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రాజాన వీర సూర్యచంద్ర మాట్లాడుతూ ం ప్రభుత్వ ఆధ్వర్యంలో కార్తీకమాస మహోత్సవం నిర్వహించడం ప్రశంసనీయమని తెలిపారు. అధికారులు ప్రజా సేవలో నిత్యం ఒత్తిడులకు లోనవుతారని, అలాంటి వారికి భక్తి, ఆధ్యాత్మికతతో కూడిన కార్యక్రమాలు నూతనోత్సాహాన్ని కలిగిస్తాయని అన్నారు. అలాగే అధికారులు పేదల పక్షాన ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు ఛైర్మన్ కరక సత్యనారాయణ, నాతవరం మండల టీడీపీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, తహశీల్దార్ ఎ. వేణుగోపాల్, ఎంపిడిఒ ఎంఎస్. శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కోంద్రు మరిడయ్య, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇటంశెట్టి సీతారామ్మూర్తి, మాజీ ఎంపిపి పారుపల్లి కొండబాబు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ బాధిత ఇళ్లను క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసిన అధికారులు



**గొలుగొండ, పతాకం న్యూస్:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ముంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న గృహాలను పరిశీలించేందుకు గురువారం గొలుగొండ మండలంలో అధికారుల బృందం పర్యటించింది. ఏ.ఎల్.పురం,సీహెచ్.నాగాపురం, కొంకసింగి,చోద్యం,పాతమల్లంపేట,గొలుగొండ,జోగంపేట గ్రామ పంచాయతీల్లోని దెబ్బతిన్న ఇళ్లను బృందం స్వయంగా తనిఖీ చేసింది. చోద్యంలోని అంగన్వాడి భవనం రిపేర్ల ప్రగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి ఎస్.ఎస్.ఎన్ మూర్తి మాట్లాడుతూ మండలంలోని సుమారు 26 గృహాలు తుఫాను ప్రభావం వలన దెబ్బతినడం జరిగిందని, వాటిని పరిశీలించి,నివేదికను పై అధికారులకు పంపిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమానికి డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు నేతృత్వం వహించగా,సంబంధిత పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. బాధితులకు త్వరలోనే పునరావాస చర్యలు చేపట్టేందుకు నివేదిక సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు.

# కాకరపాడు గ్రామంలో వినాయకుని గుడి పునర్నిర్మాణానికి ప్రభుత్వ భూమి కేటాయింపు



**కొయ్యూరు, పతాకం న్యూస్:** జాతీయ రహదారి(516ఇ) విస్తరణ పనుల భాగంగా కొయ్యూరు మండలం,కాకరపాడు గ్రామం వద్ద రోడ్డుకు ఆనుకొని ఉన్న శ్రీ వినాయక స్వామి ఆలయం పూర్తిగా తొలగించబడింది.ఈ నేపథ్యంలో గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సర్వే నంబర్ 59/1 లో రెండు సెంట్ల ప్రభుత్వ భూమిని ఆలయ పునర్నిర్మాణం కోసం కేటాయించారు.ఈ నిర్ణయంతో కాకరపాడు గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శ్రీ సిద్ధి వినాయక సేవా సంఘం మరియు గ్రామస్తులు కలెక్టర్కి,అలాగే కొయ్యూరు రెవెన్యూ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గ్రామ ప్రజలు త్వరలోనే భక్తి,విశ్వాసాలకు కేంద్రంగా నిలిచే కొత్త వినాయక ఆలయాన్ని నిర్మించేందుకు ఏర్పాట్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

# విశాఖ స్టీల్‌ప్లాంటులో తనిఖీలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** స్టీల్‌ప్లాంటులో తొలిసారి ప్రత్యేక తనిఖీలు జరుగుతున్నాయి. గత నాలుగేళ్ల నుంచి ప్లాంటులో నిర్వహణ పనులు ఆగిపోయాయి. నిధుల లేమితో మరమ్మతులు కూడా సరిగా నిర్వహించడం లేదు. ఈ నేపథ్యంలో గత ఏడాది కాలంలో స్టీల్ మెల్టింగ్ షాపు, కోక్ ఓవెన్, సింటర్ ప్లాంటుల్లో ప్రమాదాలు సంభవించాయి. ఎనిమిది మంది మరణించారు. అందులో ఐదుగురు ఉద్యోగులు కాగా మరో ముగ్గురు కాంట్రాక్టు కార్మికులు. ప్రమాదాలపై ఉద్యోగ, కార్మిక వర్గాలు ఆందోళన వ్యక్తంచేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక తనిఖీలు జరిపి నివేదిక ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ విభాగాన్ని ఆదేశించింది. ఎప్పుడు పడితే అప్పుడు తనిఖీలకు రావడం వల్ల సమస్యలు వస్తున్నాయని యాజమాన్యాలు ఆరోపించడంతో ఏడాదికి ఒకసారి మాత్రమే తనిఖీ చేయాలని గతంలో ప్రభుత్వం స్పష్టంచేసింది. ఏ కర్మాగారాన్ని ఎవరు, ఏ తేదీన తనిఖీ చేయాలో సెంట్రల్ ఇన్‌స్పెక్షన్ పోర్టల్ ద్వారా ముందుగానే తెలియజేసేవారు. ఆ అధికారి మాత్రమే వెళ్లి తనిఖీ చేసి లోపాలు గుర్తించి, వాటిని సరిచేసుకోవాలని చెప్పేవారు. ఇలా విశాఖపట్నంలో స్టీల్ ప్లాంటులో కూడా ఏడాదికి ఒకసారే తనిఖీలు జరుగుతున్నాయి. స్టీల్ ప్లాంటు పది వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. పదుల సంఖ్యలో విభాగాలు ఉన్నాయి. ఒక్కరోజులో ఒక్క అధికారి అంతా తనిఖీ చేయడం కష్టం. అయినా ఇన్నాళ్లు అలాగే నామమాత్రపు తనిఖీలు చేసుకుంటూ వచ్చారు. ఈసారి ప్రభుత్వం అన్ని విభాగాలు పరీక్షించాలని చెప్పడంతో విశాఖపట్నం జిల్లాలోని ఇద్దరు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ల (డీసీఎఫ్)తో పాటు శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ నుంచి మరో ఇద్దరేసి డీసీఎఫ్‌లను రప్పించారు. మొత్తం ఆరుగురు అధికారులు కలిసి మంగళవారం నుంచి స్టీల్‌ప్లాంటులో తనిఖీలు చేస్తున్నారు. నాలుగు రోజులు అన్నీ పరిశీలించి అంతా కలసి నివేదిక సమర్పిస్తారు. అందులో లోపాలపై సమీక్షించి, తక్షణమే వాటిని సరిచేయించాలనేది ప్రభుత్వం ఆలోచన. నిధులు లేవనే కారణంతో నాలుగేళ్లుగా ప్లాంటు నిర్వహణను గాలికి వదిలేశారు. సముద్ర తీర ప్రాంతం కావడంతో యంత్రాలు త్వరగా తుప్పుపడతాయి. దానిని ఎప్పటికప్పుడు తొలగించి పెయింట్లు వేయాల్సి ఉంటుంది. అలాగే మరమ్మతుల కోసం కొన్ని విభాగాలను కొంతకాలం మూసేయాలి. విడి భాగాలు అందుబాటులో ఉంచాలి. ప్రస్తుతం ప్లాంటులో ఏ విభాగంలోను విడి భాగాలు లేవు. రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు అత్యంత ప్రమాదకరంగా మారింది. కోక్ ఓవెన్ బ్యాటరీలు పాతవైపోయాయి. ఇలా అన్ని విభాగాల్లో ఇబ్బందులు ఉన్నాయి. ఇవన్నీ ప్రత్యేక తనిఖీల్లో బయటపెడతారా?, లేదా?...అనేది ఇప్పుడు అనుమానంగా ఉంది. ఈ తనిఖీలు పారదర్శకంగా చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# చింతపల్లి వ్యవసాయ ఉత్పత్తులను మద్దతు ధరల గోడ పత్రికను ఆవిష్కరించిన ఏఎంసి చైర్మన్ ఊర్మిళ



**చింతపల్లి, పతాకం న్యూస్ :** అల్లూరి జిల్లా ఈ పంటలో నమోదు ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరలు పొందండి. ఖరీఫ్ కాలం ప్రారంభానికి ముందే వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ శాఖ ద్వారా కూటమి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం హర్షనీయమని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కిలో ఊర్మిళ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యదర్శి జగన్ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె ప్రభుత్వం విడుదల చేసిన వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధర గోడపత్రికను మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు, టిడిపి మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు, ఇతర నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా ఖరీఫ్ కాలం ప్రారంభానికి ముందే వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ప్రకటించడం సంతోషకరమన్నారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ఉత్పత్తులకు గతంలో ముందుగా గిట్టుబాటు ధర కల్పించిన దాఖలాలు లేవన్నారు. దానివలన దళారులను నమ్మి రైతులు ఆర్థికంగా నష్టపోయేవారన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో అటువంటి పరిస్థితులు తలెత్తకూడదనే సదుద్దేశంతో మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలను ముందుగానే ప్రకటించిందన్నారు. మార్కెటింగ్ రంగంలో పోటీ పెరగాలని తద్వారా రైతులు ఉత్పత్తి చేసే వ్యవసాయ పంటలకు మెరుగైన మద్దతు ధర రావాలన్నారు. దీనికోసం అవసరమైతే ప్రభుత్వమే రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసి పోటీని పెంచుతుందన్నారు. మద్దతు ధరలకు పంటలు అమ్ముకోవాలంటే తప్పనిసరిగా ఈ పంట లో పంటల వివరాలు నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

# నర్సీపట్నం శాఖ లైబ్రరీని పరిశీలించిన గ్రంథాలయాల సంచాలకుడు కృష్ణమోహన్

**నర్సీపట్నం, పతాకం న్యూస్:** ఏపీ గ్రంథాలయాల సంచాలకుడు కృష్ణమోహన్ గురువారం నర్సీపట్నం శాఖ గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. పాఠకులకు అందుతున్న సదుపాయాలు, పుస్తకాల లభ్యతపై గ్రంధాలయాధికారి దమయంతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు అవసరమైన పుస్తకాలను "ఆన్ డిమాండ్" పద్ధతిలో నెలరోజుల్లో అందజేస్తున్నామని తెలిపారు. లైబ్రరీల సహాయంతో ఇప్పటివరకు సుమారు 700 మంది ఉద్యోగాలు సాధించారని చెప్పారు. పాఠకులు ఈ సదుపాయాలను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు.



# కాఫీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి




**చింతపల్లి, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా ఏపీఎఫ్‌డీసీలో పనిచేస్తున్న పర్మినెంట్, రోజువారీ, సీజనల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాఫీ కార్మిక సంఘం సమ్మెకు దిగింది.గత 20 రోజుల క్రితం సంబంధిత యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేసినప్పటికీ స్పందన లేకపోవడంతో గురువారం నుంచి సమ్మెను ప్రారంభించారు.చింతపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి హనుమాన్ జంక్షన్ మీదుగా కాఫీ డివిజనల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం కార్యాలయం ముందు సుమారు రెండు గంటలపాటు ధర్నా చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ సంస్థను రక్షించుకుంటూనే కార్మికుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తాం" అని హెచ్చరించారు. కార్మికుల సమస్యల పరిష్కారం ఒక భాగమైతే, సంస్థ రక్షణ మరో భాగమని, ఈ రెండు లక్ష్యాల సాధన కోసం కార్మికులు సమ్మెలోకి దిగారని తెలిపారు. గత సంవత్సరం యాజమాన్యం-కార్మికుల మధ్య కుదిరిన ఒప్పందంలో హెల్పర్ల జీతాలు తప్ప మిగిలిన సమస్యల పరిష్కారం జరగలేదని ఆయన మండిపడ్డారు. విడిఎ పాయింట్ల ప్రకారం కేజీ పండ్ల రేటు, రోజువారీ కూలీ పెంపు చేయాల్సి ఉండగా, యాజమాన్యం స్పందించలేదని విమర్శించారు. పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలను పక్కనబెట్టారని తెలిపారు.పర్మినెంట్ కార్మికుల క్వార్టర్స్ మరమ్మత్తులు చేయకపోవడం, 350 మంది సిబ్బంది అవసరమున్న చోట 18 ఏపీసీలు, 17 హెల్పర్లతోనే సంస్థ నడపడం అన్యాయం అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఐదుగురు డివిజనల్ మేనేజర్లు ఉండగా ఇప్పుడు ముగ్గురితోనే వ్యవహారాలు సాగుతున్నాయని అన్నారు.

# రూ.170 కోట్లతో వంతెనకు మోక్షం



**నాగాయలంక, పతాకం న్యూస్:** దివిసీమ ప్రజల ఏళ్ల నాటి సమస్యకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో పరిష్కారం లభించనుంది. నాగాయలంక నుంచి ఎదురుమొండి దీవుల్లోని గ్రామాల రాకపోకలకు సాగించాలంటే వారికి పంటే దిక్కు. వరదలు వచ్చినప్పుడు దాన్నీ నిలిపేస్తారు. దీంతో అక్కడి ప్రజలకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పిటిషన్లు దాఖలు చేశారు. వంతెన నిర్మాణానికి గతంలో నాబార్డు నిధులు మంజూరు చేసినా పనులు మొదలు కాలేదు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి, రైతులను మరామర్శించేందుకు అవనిగడ్డ నియోజకవర్గానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రజలు, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, అధికారులు సమస్యను వివరించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. వంతెన నిర్మాణంపై బుధవారం పవన్ కల్యాణ్ అధ్యక్షతన ఆయన కార్యాలయంలో ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, కలెక్టర్ బాలాజీ, ఆర్అండ్‌బీ అధికారులతో సమావేశం నిర్వహించారు. వంతెన నిర్మాణ సమస్య పరిష్కారంపై చర్చించారు. ఎదురుమొండి వంతెన నిర్మాణానికి గతంలో రూ.110 కోట్లు మంజూరు అయ్యాయి. నిధులు చాలకో, ఇతర కారణాల వల్ల పనులు కార్యరూపం దాల్చలేదు. మరో రూ.60 కోట్లు అవసరమని అధికారులు, ఎంపీ బాలశౌరి పవన్ దృష్టికి తెచ్చారు. దీంతో అదనపు నిధులను రాష్ట్ర మూలధన పెట్టుబడులపై ప్రత్యేక సహాయం (సాస్కి) ద్వారా మంజూరు చేసేందుకు ఆయన అంగీకరించారు.

# కళాశాల విద్యార్థినులకు కరాటే వస్త్రాల పంపిణీ



**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా, కొయ్యూరు మండలం,మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డా.కె.సుధ మరియు పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వి.చిట్టబ్బాయి ఆధ్వర్యంలో పీఎం ఉషా పథకంలో భాగంగా విద్యార్థినులకు కరాటే వస్త్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెల్ఫ్ డిఫెన్స్ కోచ్ పాండురాజు 50 మంది విద్యార్థినులకు కరాటే డ్రెస్సులు పంపిణీ చేశారు. విద్యార్థినులలో ఆత్మరక్షణ పట్ల అవగాహన పెంపొందించడం,శారీరక దృఢత్వం మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని,కరాటే సాధన ద్వారా శారీరక సామర్థ్యం పెంపొందడంతో పాటు,ఆత్మరక్షణ నైపుణ్యాలు కూడా అభివృద్ధి చెందుతాయని పాండురాజు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.వి.కె.టి.మహలక్ష్మి,పీడీ ఎల్. రమణమ్మ, అధ్యాపకులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# మోక్ష ధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాల పంపిణీ




**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా,కొయ్యూరు మండలం,పెదమాకవరం పంచాయతీ, రామరాజుపాలెం ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు మోక్ష ధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోక్ష ధర్మ ట్రస్ట్ మండల ప్రచారక్ జుర్రా గౌరీ పార్వతి మాట్లాడుతూ "భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్యే సరైన మార్గమని,తల్లిదండ్రులను,గురువులను ఎల్లప్పుడూ గౌరవించాలని,గురువు మాట విని నడుచుకునే వారికి సమాజంలో విలువతో పాటు గౌరవం లభిస్తుందని,విద్యార్థులు బాగా చదివి తమ లక్ష్యాలను సాధించాలని ఆమె ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డివిడి ప్రసాద్,ఉపాధ్యాయుడు భరత్ తదితరులు పాల్గొన్నారు.విద్యార్థులు,ఉపాధ్యాయులు ట్రస్ట్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కేవీబీపురంలో 'జల ప్రళయం'



**తిరుపతి, పతాకం న్యూస్:** కోడి కూయకనే..తెల్లవారకనే..ఆ గ్రామాలు ఉన్నపాటుగా.. ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాయి.. ఏం జరిగిందో తెలిసేలోపే వరద నీరు గ్రామాలను చుట్టుముట్టింది. వీధుల్లో నీరు ఏరులై పారడంతో పశుపక్షాదులు, మోటారు వాహనాలు కళ్లెదుటే కొట్టుకుపోయాయి. నిద్రలో ఉండగానే జల ప్రళయం గ్రామాలను ముంచెత్తడంతో గ్రామస్తుల ఆర్తనాదాలు మిన్నంటాయి. గురువారం తెల్లవారుజామున తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం ఓల్లూరు సమీపంలోని రాయల చెరువు రిజర్వాయర్ కట్టకు గండిపడ్డ సంఘటనకు నిలువెత్తు సాక్షాలివి. వివరాల్లోకి పోతే.. రాయల చెరువుకు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు భారీగా వరద నీరు చేరింది. రిజర్వాయర్ కు ప్రమాద స్థాయిలో నీరు చేరుతుందన్న క్రమంలో ఒక్కసారిగా వర్షాలు తగ్గుముఖం పడటంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే గురువారం తెల్లవారుజామున ఏం జరిగిందో తెలియదు. కానీ రిజర్వాయర్ కట్టకు గండిపడి చెరువులో నీరు పూర్తిగా లోతట్టు ప్రాంతంలోకి వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఓల్లూరు, పాతపాలెం, రాజుల కండ్రిగ, కళత్తూరు, కళత్తూరు హరిజనవాడ గ్రామాలు పూర్తిగా జల ప్రళయంలో చిక్కుకున్నాయి. వరద నీరు వీధుల్లో పోటెత్తడంతో బయట కట్టేసిన ఆవులు, గేదెలు, పాకల్లో ఉన్న మేకలు గొర్రెలు కొట్టుకుపోయాయి. అదేవిధంగా మోటారు బైకులు, ఆటోలు సైతం వరద నీటిలో కొట్టుకుపోవడం గమనార్హం. అయితే ముంపుకు గురైన గ్రామాల ప్రజలు ఇళ్ల డాబాలపైకి ఎక్కి తమ ప్రాణాలను రక్షించుకున్నారు. లోతట్టు ప్రాంతాలకు వెళ్లే క్రమంలో రాయల చెరువు వరద నీరు వేలాది ఎకరాల వరి పంటలను ముంచేసాయి. రాగిగుంట శ్రీకాళహస్తి-పిచ్చాటూరు ప్రధాన రోడ్డు మార్గాన్ని కోతకు గురి చేయడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. పంట పొలాల్లో సైతం బురద, ఇసుక మేటలు ఏర్పడ్డాయి. వరద అక్కడితో ఆగకుండా ఆదవరం, కాళంగి గ్రామాల మీదుగా కాళంగి రిజర్వాయర్ కు చేరుకుంది. దీంతో సామర్థ్యానికి మించి నీటి నిల్వలు చేరడంతో అధికారులు కాళంగి గేట్లను ఎత్తివేశారు. ఫలితంగా కాళంగి రిజర్వాయర్ల్ లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వందలాది ఎకరాలు ముంపునకు గురయ్యాయి. అనుకోకుండా వచ్చిన జల ప్రళయం ధాటికి సుమారు 2 వేల వరకు పశువులు, పదుల సంఖ్యలో వాహనాలు కొట్టుకెళ్ళాయని బాధిత గ్రామ ప్రజలు తెలిపారు.

# ఏబిఎస్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ

**పరవాడ, పతాకం న్యూస్:** పరవాడ మండలం, జీవీఎంసీ 85వ వార్డు, ఏబిఎస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఇటీవల "జన విజ్ఞాన వేదిక " మండల స్థాయి పరీక్షలు నిర్వహించిన "చెకుముకి " సైన్స్ సంబరాలు 2025 పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు కె.సిద్ధార్థ (10 వ తరగతి) జీ.హిమ వర్షిని (9వ తరగతి ) శివ గురజార్ (8వ తరగతి) జట్టు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు పీ.ఎం కొండయ్య, ప్రిన్సిపాల్ పద్మజా దీపక్, డైరెక్టర్ దీపక్, పాఠశాల గణిత ఉపాధ్యాయులు ఎం. సునీల్ కుమార్ విద్యార్థుల విజయంపై అభినందనలు తెలియజేశారు.



# డంపింగ్ యార్డ్ కు త్వరలోనే శాశ్వత పరిష్కారం: పట్టాభిరామ్

**గాజువాక, పతాకం న్యూస్:** గ్రేటర్ విశాఖ గాజువాక జోను 76వ వార్డు గంగవరం పోర్ట్ రోడ్ లో గల డంపింగ్ యార్డ్‌ను గాజువాక నాయకులతో కలిసి పర్యటించిన సందర్భంగా స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్ గాజువాక తెలుగుదేశం కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు డంపింగ్ యార్డ్ సమస్యను మా దృష్టికి తీసుకురావడంతో డంపింగ్ యార్డ్ సందర్శించామని అన్నారు. డంపింగ్ యార్డ్ పరిసరాలలో వ్యర్థాల వలన స్థానికంగా ఉంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్నామన్నారు. జీవీఎంసీ అధికారులను విజయవాడ కార్పొరేషన్ కార్యాలయం కు రావాలని ఆదేశాలు జారీ చేశామని అన్నారు. త్వరలోనే డంపింగ్ యార్డ్ కు శాశ్వత పరిష్కారానికి దారి చూపుతామని హామీయిచ్చారు.కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్,గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ రావు, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు,గంధం శ్రీనివాసరావు, 73వ వార్డు అధ్యక్షులు సింగూరి అనంత్, గాజువాక బీసీ సెల్ అధ్యక్షులు తమిరె శివప్రసాద్, బీసీ సెల్ నాయకులు సత్యారావు, మాధవ్, వెంకటేశ్వరరావు, చంద్రరావు పాల్గొన్నారు.



# 'ఎఎంఆర్' ఇష్టారాజ్యం

## గగ్గోలు పెడుతున్న గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు



**ఒంగోలు, పతాకం న్యూస్:** గ్రానైట్ రాయల్టీ వసూళ్ల బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకొని ఎం/ఎస్ ఎఎంఆర్ ఇండియా లిమిటెడ్‌కు అప్పగించింది. ఆ ప్రైవేట్ సంస్థ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రాయల్టీని రెట్టింపు చేసింది. ప్రభుత్వ నిర్ణయించిన మేరకే కడతామని వ్యాపారులు అంటుండగా, తాము నిర్ణయించిన మేరకే కట్టాలని ఆ సంస్థ డిమాండ్ చేస్తోంది. దీంతో, గ్రానైట్ వ్యాపారులు ఆ సంస్థకు కాకుండా ప్రభుత్వానికి రాయల్టీ చెల్లిస్తున్నారు. సమస్యను పరిష్కరించే వరకూ తాము ఈ విధంగానే చేస్తామని చెప్తున్నారు. బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో 6,157 గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఇందులో మిల్టీబుల్ బ్లేడ్ ఫ్యాక్టరీలు 1,250. స్లాబ్ సిస్టం కింద ఉన్నవి 2,750. ఇవన్నీ చిన్నచిన్న పారిశ్రామికవేత్తలు నడుపుతున్నారు. రాయల్టీ ఆదాయం పక్కదారి పడుతోందంటూ దీనిని అరికట్టే పేరుతో వసూలు బాధ్యతను ఎం/ఎస్ ఎఎంఆర్ సంస్థకు ప్రభుత్వం రెండు నెలల క్రితం అప్పగించింది. గ్రావెల్, ఎగుమతి రాళ్లు, ఇతర మైనింగు కార్యకలాపాల నిర్వహిస్తున్న పరిశ్రమల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన రాయల్టీ ప్రకారం నెలకు రూ.70.50 కోట్లు వస్తుంది. దీనిలో ప్రభుత్వానికి ఆ సంస్థ జిఎస్‌టితో కలిపి రూ.55 కోట్లు చెల్లించాలి. మిగతా 15.50 కోట్లు మిగులుతుంది. అయితే, రెట్టింపు (రూ.70 వేలు) రాయల్టీ కట్టాలని ఆ సంస్థ డిమాండ్ చేస్తోంది. దీనివల్ల వసూలు రెట్టింపు కానున్నా ప్రభుత్వానికి చెల్లించే మొత్తంలో మాత్రం తేడా ఉండదు. రెట్టింపు వసూళ్ల వెనుక పంపకాలున్నాయనే చర్చ సాగుతోంది. అదనంగా చెల్లించలేమని, ఫ్యాక్టరీలు మూసేయడం తప్ప మరో మార్గంలేదని యజమానులు తేల్చి చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా మంత్రులు, గనుల శాఖ మంత్రితో యజమానులు సమావేశమై చర్చలు జరిపారు. పరిష్కారానికి ఒక కమిటీని ఏర్పాటైంది. ఏం పరిష్కారం చూపుతుందో చూడాలి.

# లంచాల అడ్డాగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు..



**అమరావతి, పతాకం న్యూస్:** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలపై వెల్లువెత్తుతున్న ఫిర్యాదుల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) రంగంలోకి దిగింది. రాష్ట్రవ్యాప్తంగా కీలకమైన 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏకకాలంలో మెరుపుదాడులు నిర్వహించింది. విజయనగరం నుంచి చిత్తూరు వరకు పలు జిల్లాల్లో చేపట్టిన ఈ ఆకస్మిక సోదాల్లో లెక్కల్లో చూపని భారీ నగదుతో పాటు రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో అనేక అక్రమాలు, రికార్డుల్లో తేడాలను అధికారులు గుర్తించారు. విశాఖపట్నంలోని పెదగంట్యాడ, మధురవాడ, జగదాంబ సెంటర్‌తో పాటు విజయనగరం జిల్లా భోగాపురం, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం, పల్నాడు జిల్లా నరసరావుపేట, ప్రకాశం జిల్లా ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, సత్యసాయి, అన్నమయ్య, నంద్యాల జిల్లాల్లోని ప్రధాన కార్యాలయాల్లో ఈ తనిఖీలు జరిగాయి. భోగాపురం, జగదాంబ సెంటర్, ఇబ్రహీంపట్నం, ఒంగోలు, నెల్లూరు, నరసరావుపేట కార్యాలయాల్లో రూ.10 వేల నుంచి రూ.75 వేల వరకు అనధికారిక నగదు లభించిందని ఏసీబీ డీజీ అతుల్ సింగ్ తెలిపారు. ఈ సొమ్మును లంచాలు, అనధికారిక లావాదేవీల రూపంలో సేకరించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ప్రధానంగా 'ఎనీవేర్ రిజిస్ట్రేషన్' విధానంలో ఎక్కువ అవకతవకలు జరుగుతున్నట్లు ఏసీబీ గుర్తించింది. కలెక్టర్ అనుమతి లేకుండా నిషేధిత జాబితాలోని భూములను రిజిస్టర్ చేయడం, లంచాలు ఇవ్వని వారి ఆస్తుల డాక్యుమెంట్లను పెండింగ్‌లో పెట్టడం, నాన్-జ్యుడీషియల్ స్టాంప్ పేపర్ల విక్రయాల రిజిస్టర్లలో అవకతవకలను అధికారులు కనుగొన్నారు. పలుచోట్ల ఏసీబీ అధికారులను చూడగానే డాక్యుమెంట్ రైటర్లు, ప్రైవేటు వ్యక్తులు పరారయ్యారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ, అన్నమయ్య జిల్లా రాజంపేటలో డాక్యుమెంట్ రైటర్లు తమ ల్యాప్‌టాప్‌లు, దస్తావేజులను అక్కడే వదిలేసి పరుగులు తీశారు.

ఒంగోలు కార్యాలయంలో అయితే ఏసీబీ బృందాలను చూసి కొందరు సిబ్బంది మొదటి అంతస్థు నుంచి కిందకు డబ్బు విసిరేయగా, మరికొందరు వాష్‌రూమ్‌లో దాచిపెట్టారు. అక్కడ సుమారు రూ.48 వేల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇబ్రహీంపట్నంలో ఓ అధికారి బీరువాలో రూ.74,600, రేణిగుంటలో కార్యాలయ స్వీపర్ వద్ద రూ.6,500 పట్టుబడింది. పలు కార్యాలయాల్లో అనధికారికంగా ప్రైవేటు వ్యక్తులు పనిచేస్తున్నట్లు కూడా గుర్తించారు. ఈ దాడులపై ఏసీబీ డీజీ అతుల్ సింగ్ మాట్లాడుతూ, "సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతిపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా తనిఖీలు చేపట్టాం. రికార్డుల పరిశీలనలో చాలా తేడాలు గుర్తించాం. పూర్తిస్థాయి విచారణ అనంతరం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. అవినీతిపై ప్రజలు ఆధారాలతో ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న రికార్డులను, నగదును ఏసీబీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

# గిరిజన, గురుకుల, ఆశ్రమ పాఠశాలల గోడు వినరా!

**అమరావతి, పతాకం న్యూస్:** అక్షరాస్యతలో బాగా వెనుకబడిన ప్రాంతాలు గిరిజన ప్రాంతాలు. అటువంటి గిరిజన ప్రాంతాలలో అక్షరాస్యత పెంచాలనే లక్ష్యంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 46 గిరిజనులకు విద్య, రక్షణ, సదుపాయాలు కల్పించాలని పేర్కొంది. 1985 నుండి 1990 వరకు గిరిజనుల విద్య కోసం చేసిన కృషి ప్రశంసించదగ్గది. క్రమేణా ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, గిరిజన ప్రాథమిక పాఠశాలలను నెలకొల్పి అక్షరాస్యత కోసం, విద్య కోసం సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేయడం జరిగింది. రాజ్యాంగంలో షెడ్యూల్ తెగలకు ప్రత్యేకమైన రక్షణలు, సదుపాయాలు కల్పించబడ్డాయి. గిరిజనులకు విద్యను అందిస్తూ వారిని అన్ని విధాలా సామాజిక వివక్షతల నుంచి, దోపిడీ నుంచి రక్షించాలని ఆర్టికల్ 46 సూచించింది. 5వ షెడ్యూల్ ద్వారా గిరిజన ప్రాంతాల పరిపాలన గవర్నరుకు ప్రత్యేక బాధ్యతను ఇచ్చింది. 275(1) ప్రకారం షెడ్యూలు ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నోడల్ ప్యాకేజీలను ఇవ్వాలని సూచించింది. రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలు నేటికీ అమలుకు నోచుకోలేదని, బాలారిష్టాలతోనే కొనసాగుతున్నాయని గిరిజన ప్రాంతాలలో జరిగే సంఘటనలే నిరూపిస్తున్నాయి. ఈనాటికీ గిరిజన ప్రాంతాల నుండి ఆసుపత్రికి రావాలంటే డోలీ మోతలు ప్రత్యేక కథనాలుగా చూస్తున్నాము. ఆ ప్రాంత ప్రజలపైగల బాధ్యతా రాహిత్యం విద్యార్థులు చదువుకునే సంక్షేమ గృహాలపై కూడా కొనసాగుతున్నది. పదేళ్ల క్రితం కురుపాం మండలం తుమ్మికమానుగూడకు చెందిన ముగ్గురు విద్యార్థులు టంపలపాడు ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్నపుడు తాగునీరు లేక, మరుగుదొడ్లు లేక రోగాల బారినపడి చనిపోయిన ఘటన నుండి తాజాగా కురుపాం మండల కేంద్రంలోగల గురుకుల బాలికల పాఠశాలలో జరిగిన ఘటన వరకు రాష్ట్రాన్ని కుదిపివేశాయి. ఇద్దరు బాలికలు చనిపోవడం, 138 మంది పచ్చ కామెర్లతో ఆసుపత్రిపాలు కావడం సంక్షేమ హాస్టళ్ల పట్ల ప్రభుత్వ బాధ్యత ఏపాటిదో రుజువు అవుతున్నది. ఈ ఘటనే కాదు. గిరిజన సంక్షేమ హాస్టళ్లు ఎక్కువ శాతం సౌకర్యాల లేమితో కునారిల్లుతున్నాయి. బాలికల వసతి గృహాలు సరిపడినన్ని లేక కురుపాం గురుకుల పాఠశాలల పరిస్థితి అత్యంత దయనీయంగా వుంది. పాఠాలు బోధించడానికి, బాలికలు నిద్రించడానికి, సామానులు భద్రపరచడానికి, భోజనాలు చేయడానికి అన్నింటికీ ఒకటే గదులు. 600 పైచిలుకు గల బాలికలకు కేవలం 18 మాత్రమే మరుగుదొడ్లున్నాయి. ఆరవ తరగతి నుండి ఇంటర్ వరకు క్లాసులున్న గురుకులాలు సమస్యల నిలయాలుగా ఉన్నాయి. బాలికల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ఒక్క ఆశ్రమ పాఠశాలలో కూడా ఎ.ఎన్.ఎం లు లేరు. గురుకులాలలో ఉన్నప్పటికీ తగిన మందులు, సౌకర్యాలు కల్పించడంలేదు. ఆశ్రమ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు భయపడి ఆందోళనతో స్వంత డబ్బులతో ఆరోగ్య కార్యకర్తలను నియమించుకుంటున్నారు. రెండు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. పాలకులు మారుతున్నా పరిస్థితులు మారడం లేదు. వార్డెన్ పోస్టులు శాశ్వత ప్రాతిపదికన లేనందున ఉపాధ్యాయులే డిప్యూటీ వార్డెన్ బాధ్యతలు చేపడుతున్నారు. బోధన ఒకవైపు, పిల్లల బాధ్యత మరొకవైపు చూడటం నష్టదాయకంగా ఉంది. వైద్యపరమైన సేవలు అందించడానికి ప్రత్యేకంగా శాశ్వత సిబ్బంది లోపం కూడా విద్యార్థులకు శాపంగా మారుతున్నది. విద్యార్థుల అనారోగ్య పరిస్థితులలో మెడికల్ ఖర్చు ముందస్తుగా ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లపై పడుతున్నది.



ఆశ్రమ పాఠశాలలలో ఆయాలు లేరు. గిరిజన ప్రాథమిక పాఠశాలల నుండి 3, 4, 5 తరగతుల పిల్లలను ఆశ్రమ పాఠశాలలకు విలీనం చేసిన తరువాత అంత చిన్నపిల్లల ఆలనా పాలన చూసే ఆయాలు గాని, టీచర్లు గాని ప్రత్యేకంగా లేకపోవడం వలన పిల్లల మానసిక, శారీరక, విద్యాపరమైన అంశాలపై తీవ్ర ప్రభావం చూపి డ్రాపవుట్లుగా మారుతున్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలను ఏర్పాటు చేసి గుణాత్మక విద్యను అందివ్వాలి. తద్వారా సామాజికంగా, ఆర్థికంగా మెరుగైన జీవన పరిస్థితులు కల్పించాలనేది ఆచరణలో జరుగుతున్నదా అనేది పరిశీలిస్తే ఆటంకాలు అనేకం. బడులు లేక, ఉన్నా బడుల్లో టీచర్లు లేక, అసంపూర్ణ భవనాలు, చాలీచాలని వసతులు కనిపిస్తున్నాయి. తాగునీటిది పెద్ద సమస్య. ఎప్పటికప్పుడు ఆర్.ఓ ప్లాంట్లు మరమ్మతులకు గురికావడం, వాటి కోసం నిధులు కేటాయించక పోవడం. ఇవన్నీ పరిశీలిస్తే గిరిజన విద్య కోసం బడ్జెట్ కేటాయింపులు తగ్గిపోవడం. దాంతో గిరిజన సంక్షేమ హాస్టళ్లలో పిల్లలు రోగాల బారినపడి పిట్టల్లా రాలిపోవడం చూస్తున్నాం. విషజ్వరాలు, పచ్చకామెర్లు, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ఈ రంగంపై నిర్లక్ష్యం తగదు. గిరిజన బాలబాలికలకు చదువు, వసతి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో మూడవ పంచవర్ష ప్రణాళికలో ప్రభుత్వ బాలుర-బాలికల వసతి గృహాలు ప్రారంభించారు. ఎప్పటికప్పుడు మౌలిక వసతులు కల్పించే విషయంలో బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా, మరమ్మతులు, వైద్య అవసరాలు, పోషక విలువలతో కూడిన మెనూ చార్జీల పెంపునకు నిధులు వుండాలి. ఈ ఏడాది షెడ్యూల్ తెగల సంక్షేమానికి కేవలం రూ.8,159 కోట్లు మాత్రమే కేటాయించారు. పాఠశాల విద్యకు రూ.31,806 కోట్లు కేటాయించారు. గిరిజన విద్యారంగానికి కేటాయింపులు తక్కువ. ఇటువంటి పరిస్థితులలో గిరిజన సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న బాలబాలికలకు ఆరోగ్యం బాలేకపోతే బాధ్యత ఎవరిది? ఇటువంటి పరిస్థితులను ఎవరు చక్కదిద్దుతారో పాలకులే చెప్పాలి.

రాజ్యాంగ పరమైన హక్కులను అమలు చేయకపోవడంతో గిరిజన ప్రాంతాలు వెనుకబడ్డాయి. పేదరికం, దోపిడీ, వెనుకబాటుతనం నుండి విముక్తి జరగాలంటే నేటితరం గిరిజన విద్యార్థులంతా చదువుకోవాలి. సంక్షేమ హాస్టళ్లను ఆశ్రయించే విద్యార్థుల కోసం మౌలిక సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత.

# 12 రాష్ట్రాల్లో మహిళా పథకాలు.. రూ.1.68 లక్షల కోట్ల భారం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** మహిళలను లక్ష్యంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నగదు బదిలీ పథకాలు (యూసీటీ) వాటి ఆర్థిక వ్యవస్థలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. ఈ పథకాల వల్ల మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాలు సైతం రెవెన్యూ లోటులోకి జారిపోతున్నాయని 'పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్' అనే సంస్థ తన నివేదికలో హెచ్చరించింది. కేవలం మూడేళ్ల క్రితం రెండు రాష్ట్రాలకే పరిమితమైన ఇలాంటి పథకాలు, ఇప్పుడు దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలకు విస్తరించాయని ఈ నివేదిక పేర్కొంది. ఈ 12 రాష్ట్రాలు తమ ప్రస్తుత బడ్జెట్‌లో ఈ పథకాల అమలు కోసం ఏకంగా రూ.1.68 లక్షల కోట్లు (1.68 ట్రిలియన్లు) వెచ్చిస్తున్నాయని తెలిపింది. ఇది రాష్ట్రాల ఖజానాపై మోయలేని భారంగా మారుతోందని విశ్లేషించింది. ఈ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్రాల్లో ఆరు రాష్ట్రాలు ఇప్పటికే ఈ ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటును నమోదు చేశాయని పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ తన నివేదికలో స్పష్టం చేసింది. నగదు బదిలీ పథకాల విస్తృతి రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థకు పెను సవాల్‌గా మారిందనడానికి ఇదే బలమైన నిదర్శనమని వ్యాఖ్యానించింది. సంక్షేమం పేరుతో అమలు చేస్తున్న ఈ ఉచిత నగదు బదిలీ పథకాల వల్ల రాష్ట్రాల ఆర్థిక క్రమశిక్షణ దెబ్బతింటోందని, భవిష్యత్తులో ఇది మరింత తీవ్రమైన పరిణామాలకు దారితీయవచ్చని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఢిల్లీ పర్యటనకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు - 52 మంది ఎంపిక

**అమరావతి, పతాకం న్యూస్:** ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఏపీ సైన్స్ సిటీ, సమగ్ర శిక్ష అభియాన్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 52 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు ఎంపికయ్యారు. సైన్స్, టెక్నాలజీ పరిజ్ఞానాన్ని ప్రత్యక్ష అనుభవంతో నేర్చుకునేందుకు వీరంతా మూడు రోజుల సైన్స్ ఎక్స్‌పోజర్ పర్యటన కోసం ఢిల్లీకి బయలుదేరారు.

జిల్లాకు ఇద్దరు చొప్పున ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసిన ఈ విద్యార్థులు నవంబర్ 6 నుంచి 8 వరకు వివిధ శాస్త్రీయ పరిశోధనా కేంద్రాలు, సైన్స్ మ్యూజియాలు, రాకెట్ పరిశోధన కేంద్రాలను సందర్శించనున్నారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి, పరిశోధనా ధోరణి పెంచేందుకు రూపొందించారు. పాఠ్యపుస్తకాల్లో ఉన్న శాస్త్ర విషయాలను కేవలం క్లాసు గదుల్లో నేర్చుకోవడం కాకుండా, ప్రత్యక్షంగా చూసి తెలుసుకోవాల్సిన అవసరం ఉందనే భావనతో ఈ టూర్‌కు రూపకల్పన చేశారు. టూర్ తొలి రోజున విద్యార్థులు ఘజియాబాద్‌లోని కైట్ ఇంజినీరింగ్ కాలేజీని సందర్శించారు. అక్కడ రాకెట్ ఎలా నిర్మిస్తారు, ప్రయోగంలో ఏ సూత్రాలు పనిచేస్తాయి, ఇంధన వినియోగం, నావిగేషన్ వ్యవస్థలు ఎలా పని చేస్తాయి వంటి అంశాలపై కాలేజీ ప్రొఫెసర్లు విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. రాకెట్ నమూనాలను చూపిస్తూ వాటి రూపకల్పనలోని శాస్త్రీయ అంశాలపై వివరణ ఇచ్చారు. ఈ అవకాశంతో విద్యార్థుల్లో పరిశోధనకు ఆసక్తి మరింతగా పెరిగిందని కైట్ కాలేజీ అధ్యాపకులు పేర్కొన్నారు. సాయంత్రం సమయంలో విద్యార్థులు పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో భేటీ అయ్యేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రితో జరిగే సంభాషణలో విద్యార్థులు తమ లక్ష్యాలు, భవిష్యత్తు ప్రణాళికలు, సైన్స్ రంగంపై ఉన్న ఆసక్తిని వివరించనున్నారు. ఈనెల 7న విద్యార్థులు ఢిల్లీలోని రష్యన్



సైన్స్ అండ్ కల్చర్ సెంటర్‌ని సందర్శించనున్నారు. అక్కడ రష్యాతో భారతదేశం కలిగిన అంతరిక్ష సహకారం, స్పుత్నిక్ ఉపగ్రహ ప్రయోగాలు, అంతరిక్ష సాంకేతికతలో ఇరు దేశాల పరిశోధనా ప్రయాణాలపై అక్కడి నిపుణులు విద్యార్థులకు వివరించనున్నారు. ఇక ఈనెల 8న జాతీయ సైన్స్ మ్యూజియం, నెహ్రూ ప్లానెటేరియం, రాకెట్ నిర్మాణ వర్క్‌షాప్‌ను సందర్శిస్తారు. మోడల్ రాకెట్ తయారీ కార్యక్రమంలో విద్యార్థులు స్వయంగా రాకెట్ నమూనాలను తయారుచేసి వాటి ప్రయోగ పద్ధతులపై అవగాహన పొందనున్నారు. అంతేకాకుండా నాసా ఇంజినీర్ గేబేతో విద్యార్థులు ఆన్‌లైన్ ఇంటరాక్షన్ చేయడం ఈ పర్యటనలో ముఖ్య ఆకర్షణగా నిలవనుంది. శాస్త్రవేత్తలు అంతరిక్ష పరిశోధనలో ఎదుర్కొనే సవాళ్లు, వాటి పరిష్కారాలు, భవిష్యత్ టెక్నాలజీలపై సూచనలు ఇవ్వనున్నారు.

# కాబోయే 'అమ్మలకు' ఈ పోషకాలు' అందాలి

మామూలుగా కిడ్నీ బాధితుల్లో అధిక రక్తపోటు లేదంటే మధుమేహం ఇలా ఏదో బయటకు కనిపించే కారణాలు ఉంటాయి. తాజాగా అంతుచిక్కని కారణాలు పలువురిలో కిడ్నీ ఫెయిల్యూర్?కు దారితీస్తున్నాయి. ఈ క్రమంలో ఎండలో పనిచేసే రైతులు, కూలీలకు దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి ఉంటోందని తాజా నివేదికలో వెల్లడైంది. మరి, ఎండవల్ల కిడ్నీలు ఎలా దెబ్బతింటాయో ఇప్పుడు తెలుసుకుందాం!

ఎండలో పనిచేసే రైతులు, కూలీలకు వేడి, ఒత్తిడి కారణంగా దీర్ఘకాలిక మూత్రపిండాల వైఫల్యానికి గురయ్యే ప్రమాదం ఉందని లాన్సెట్ మ్యాగజైన్?లో ప్రచురితమైంది. మద్రాస్ మెడికల్ కాలేజీ యూరాలజీ విభాగ పూర్వ అధిపతి, తమిళనాడు రాష్ట్ర అవయవ మార్పిడి కమిషన్ కార్యదర్శి డా. గోపాలకృష్ణన్ నేతృత్వంలోని బృందం ఓ సర్వే నిర్వహించింది. తమిళనాడులోని ప్రతి 20 మంది వ్యవసాయ కూలీల్లో ఒకరికి దీర్ఘకాల మూత్రపిండ వ్యాధి ఉంటోందని ఈ సర్వేలో తేలింది. అలాగే, ఈ రుగ్మత ఉన్న ప్రతి ఇద్దరిలో ఒకరికి ఇదెందుకు తలెత్తిందన్నది అంతు చిక్కకుండా ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో పెద్ద వయసు, డయాబెటిస్, హైబీపీ, అనీమియా, వారంలో ఆరుబయట పని చేస్తున్న కాలం వంటి అంశాలకు ఈ సమస్యతో సంబంధం ఉండొచ్చని తెలిపింది. మద్రాసు మెడికల్ కాలేజీలోని యూరాలజీ విభాగం తరపున 2023 ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో క్షేత్రస్థాయి ఓ సర్వే నిర్వహించారు. తమిళనాడులోని 125 గ్రామాలకు చెందిన



3,350 మంది రైతుల కిడ్నీల పనితీరును పరీక్షించి ఐదు వర్గాలుగా విభజించారు. వారిలో 17.3% మందికి కిడ్నీలు దెబ్బతిన్నట్లు సర్వేలో తేలింది. మళ్లీ మూడు నెలల తర్వాత పరీక్షించగా, అప్పుడు 5.31శాతానికి తగ్గిందని పేర్కొంది. అయితే, ఈ సర్వేలో పాల్గొన్న వారిలో సగం మందికి డయాబెటిస్, హైబీపీ, గుండెజబ్బులు లేదా జన్యుపరమైన రుగ్మతలు సహా ఇతర అనారోగ్యాలు లేవని తెలిపింది. ఈ వివరాలను 'ద లాన్సెట్ రీజినల్ హెల్త్ సౌత్ ఈస్ట్ ఏషియా' జర్నల్? ప్రచురించింది. ఈ క్రమంలో, కేవలం ఎండ ప్రభావంతోనే కిడ్నీ వైఫల్యానికి గురవుతున్నారని డాక్టర్ గోపాలకృష్ణన్ అంటున్నారు. రైతులు, నిర్మాణరంగ, ఇటుక బట్టీ కార్మికులు నిత్యం చాలా గంటలు వేడి ప్రదేశంలో పనిచేసినప్పుడు శరీరంలో నీటిని త్వరగా కోల్పోతున్నారని, ఇది మూత్రపిండాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని చెబుతున్నారు.

ఈ క్రమంలో కిడ్నీలు దెబ్బతినడానికి సూర్యరశ్మి నేరుగా కారణం కానప్పటికీ, వేడికి సంబంధించిన ఒక ముఖ్యమైన అంశం కిడ్నీల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుందంటున్నారు నిపుణులు. ఎలాగంటే, ఎక్కువసేపు తీవ్రమైన ఎండలో లేదా అధిక వేడి ఉన్న ప్రదేశంలో పనిచేయడం వల్ల శరీరం నుంచి నీరు, లవణాలు అనేవి వేగంగా కోల్పోతారని చెబుతున్నారు. దీనివల్ల శరీరం డీహైడ్రేట్ అవుతుందని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో శరీరంలో నీటి శాతం తగ్గితే, కిడ్నీల పని తీరుపై ఒత్తిడి పెరుగుతుందని వివరిస్తున్నారు.

ప్రతి ఒక్కరికి కిడ్నీల ఆరోగ్యంపై అవగాహన అవసరమంటున్నారు నిపుణులు. డయాబెటిస్, బీపీ లాంటి రోగాలు లేకున్నా, దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి బారిన పడుతున్నారని చెబుతున్నారు. ఈ క్రమంలో చాలామందిలో ఈ వ్యాధి ముదిరే వరకు లక్షణాలు బయటపడవని, ఎలాంటి దీర్ఘకాలిక రోగాలు లేకున్నా ఏటా ఒకసారైనా కిడ్నీలను పరీక్షించుకోవాలని తెలియజేస్తున్నారు. బీపీ, డయాబెటిస్ నియంత్రణతో పాటు ధూమపానం, మద్యపానం ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెబుతున్నారు. రోజూ తగిన వ్యాయామం, పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా, ఎక్కువ నీళ్లు తాగాలని అంటున్నారు. డాక్టర్ల సూచనలు లేకుండా సొంతంగా పెయిన్ కిల్లర్లు, యాంటాసిడ్లు మందులు వాడవద్దని పేర్కొంటున్నారు.

# గంధంతో.. మీ అందానికి మెరుగులు పెట్టండిలా..!

గంధం సువాసన అంటే నచ్చనివారుండరు. దీని సువాసన చూడగానే మనస్సు ఎంతో ప్రశాంతంగా, ఆహ్లాదంగా మారుతుంది.అందుకే గంధాన్ని అరోమాథెరపీ, మెడిటేషన్ ప్రాక్టీస్‌లో ఎక్కువగా వాడుతూ ఉంటారు. దీనిలో ఔషధ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రకారం- తలనొప్పి, చర్మ వ్యాధులు, జ్వరం, కంటి సమస్యలతోపాటు తేలు విషానికి విరుగుడుగానూ దీన్ని ఉపయోగిస్తారు. గంధం మన సౌందర్య సంరక్షణలోనూ ఎంతగానో సహాయపడుతుంది. గంధంలో యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీమైక్రోబయల్, యాంటీప్రొలిఫెరేటివ్, యాంటీవైరల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు మెండుగా ఉంటాయి. మన చర్మ సంరక్షణకు గంధం ఎలా సహాయపడుతుందో, స్కిన్ కేర్‌లో చందనం ఎలా యాడ్ చేసుకోవాలో ఇప్పుడు చూద్దాం. గంధం చర్మం ముడతలు పడకుండా రక్షిస్తుంది. దీనిలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టంతో ఇవి పోరాడతాయి. దీంతో ముడతలు, గీతలు పడకుండా నివారిస్తుంది. గంధం స్కిన్ టోన్‌ని మెరుగుపరుస్తుంది. చర్మ వ్యాధులకు చికిత్స చేస్తుంది. చర్మంలో పేరుకున్న మలినాలు తొలగిస్తుంది, చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది. చర్మాన్ని మృదువుగా మారుస్తుంది. సన్ టాన్, పిగ్మెంటేషన్‌ను తొలగిస్తుంది. గంధం, నీళ్లు వేసి పేస్ట్‌లా తయారు చేసుకోండి. ఈ పేస్ట్‌ను ముఖానికి అప్లై చేసి 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత ముఖం శుభ్రం చేసుకుని, మాయిశ్చరైజర్ అప్లై చేసుకోండి.

మొటిమలతో బాధపడేవారికి.. ఈ ప్యాక్ చాలా బాగా హెల్ప్ అవుతుంది. పసుపు, చందనం, కర్పూరం మొటిమల మచ్చలు తొలగించడానికి సహాయపడతాయి. బ్లాక్ హెడ్స్‌ను తొలగిస్తాయి.



కర్పూరం పసుపులో యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి చర్మ సమస్యల నుంచి రక్షిస్తాయి. ఇవన్నీ మిక్స్ చేసి పేస్ట్‌లా చేసుకోండి. ఈ పేస్ట్‌ను ముఖానికి అప్లై చేసి 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. దీన్ని నీటితో శుభ్రం చేసుకోవడం కంటే.. ఐస్ వాటర్‌లో ముంచిన కాటన్ బాల్‌తో శుభ్రం చేసుకోండి. ఈ ప్యాక్ వారానికి రెండు సార్లు వేసుకుంటే.. చర్మంపై మురికి, వ్యర్థ పదార్థాలు తొలగుతాయి. ఇది యాంటీ పొల్యూషన్ ఫేస్ ప్యాక్‌లా సహాయపడుతుంది. టమాటాలో ఆస్ట్రింజెంట్ గుణాలు ఉంటాయి. ఇవి చర్మంలోకి లోతుగా చొచ్చుకుని వెళ్లి.. బ్లాక్ హెడ్స్, వైట్ హెడ్స్‌ను తొలగిస్తాయి. ప్రకాశవంతమైన చర్మం మీ సొంతం అవుతుంది. ఇవన్నీ మిక్స్ చేసి.. పేస్ట్‌లా తయారు చేయండి. ఈ పేస్ట్‌ను ముఖానికి అప్లై చేసి 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత ముఖానికి నీటితో శుభ్రం చేసుకుని మాయిశ్చరైజర్ అప్లై చేయండి. ఈ ప్యాక్ చర్మంపై పేరుకున్న మురికిని తొలగిస్తుంది, అదనపు సెబమ్‌ను గ్రహిస్తుంది. దీంతో మొటిమల సమస్య దూరం అవుతుంది.

వీటిని మిక్స్ చేసి పేస్ట్‌లా చేయండి. ఆ తర్వాత ముఖానికి అప్లై చేసి 20 నిమిషాలపాటు ఆరనివ్వండి. ఆ తర్వాత.. ముఖాన్ని శుభ్రం చేసుకుని, మాయిశ్చరైజర్ అప్లై చేసుకోండి. ఈ ప్యాక్ మీ ముఖంపై ఉన్న మచ్చలను తొలగిస్తుంది. ముఖాన్ని తాజాగా మారుస్తుంది. తేనెలోని యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు.. చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ ఎఫెక్ట్ నుంచి రక్షిస్తాయి. ముడతలు, గీతలు మాయం అవుతాయి.

వీటిని మిక్స్ చేసి.. పేస్ట్‌లా చేసుకోండి. దీన్ని ముఖానికి, ట్యాన్ ఉన్న ప్రాంతాల్లో అప్లై చేసి అరగంట పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో ముఖం శుభ్రం చేసుకుని, మాయిశ్చరైజర్ అప్లై చేసుకోండి. ఈ ప్యాక్ టాన్ తొలగించడానికి ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. పెరుగు కూలింగ్ ఏజెంట్‌గా ఉంటుంది. గంధంపొడి ట్యాన్ తొలగిస్తుంది, పెరుగు చర్మాన్ని మృదువుగా మారుస్తుంది. ఇవన్నీ కలిపి పేస్ట్‌లా చేయండి. దీన్ని ముఖానికి ప్యాక్‌లా అప్లై చేసి.. కొంత సేపు ఆరనివ్వండి. ఆ తర్వాత నీటితో శుభ్రం చేసుకుని.. మాయిశ్చరైజర్ అప్లై చేసుకోండి. ట్యాన్ తొలగించడానికి, మీ చర్మం ఛాయను పెంచడానికి ఈ ప్యాక్ అద్భుతంగా పనిచేస్తుంది.

# చేనేతకు చేయూత ఏదీ?

## గిట్టుబాటు ధర రాక కార్మికులు విలవిల.. పేరుకున్న ఆప్కో బకాయిలు



**కాకినాడ, పతాకం న్యూస్:** ఒకప్పుడు చేనేత కార్మికులకు చేతినిండా పని ఉండేది. అందుకు తగ్గట్లు ఫలితం దక్కేది. కూలి గిట్టుబాటు అయ్యేది. ప్రభుత్వ విధానాలతో ఈ రంగం కళావిహీనం అవుతోంది. టిడిపి కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న నేతన్నలకు భంగపాటు తప్పలేదు. ఉచిత విద్యుత్ పథకాన్ని అరకొరగానే అమలు చేస్తోంది. మరోవైపు 'నేతన్న నేస్తం' నిలిచిపోయింది. ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతుండడంతో నేసిన చీరల ధర పెరగడంతో కొనేవారులేక కార్మికులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోతున్నారు. గతంలో కిలో పట్టు రూ.3 వేలు ఉండేది. ఆ తర్వాత రూ.5 వేలకు పెరిగింది. ప్రస్తుతం రూ.8 వేలకు చేరింది. జరీ కట్ట రూ.325 ఉండేది.

ఈ ఏడాది రూ.500 నుంచి రూ.600కు పెరిగింది. రంగులు గతంలో రూ.150 నుంచి రూ.170 ఉండగా, ప్రస్తుతం వీటి ధర రూ.300 నుంచి రూ.500కి చేరింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో 50 సహకార సంఘాల్లో సుమారు 30 వేల మంది చేనేత కార్మికులుగా నమోదయ్యారు. మాస్టర్ వీవర్స్ వద్ద పనిచేస్తున్న వారు మరో 40 వేల మంది ఉన్నారు. అధికారిక లెక్కల ప్రకారం 15,700 మగ్గాలు ఉన్నాయి. వీటిలో సహకార రంగంలో 11,980, సహకారేతర రంగంలో 3,720 నడుస్తున్నాయి. గత మూడు నెలలుగా చాలా మగ్గాలు పనిలేక మూతబడ్డాయి.

గత వైసిపి ప్రభుత్వం నేతన్న నేస్తం పేరుతో ఒక్కొక్కరికీ రూ.24 వేలు ఏటా సాయం అందించింది. 2023 జులైలో కోనసీమ జిల్లాలో 4,279 మందికి, కాకినాడ జిల్లాలో 2,778 మందికి, తూర్పుగోదావరి జిల్లాలో 916 మందికి చివరిగా అందింది.

టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలైనా నేతన్న నేస్తం ఇవ్వడం లేదు. ఈ ఏడాది ఆగస్టు ఏడున మంగళగిరిలో జరిగిన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా అతి త్వరలో 'నేతన్న నేస్తం' కింద రూ.25 వేల చొప్పున ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినా నేటికీ అమలు కాలేదు. జిఎస్‌టి రీయింబర్స్ చేస్తామని చెప్పినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. చేనేత మగ్గాలు ఉన్నవారికి 200 యూనిట్లు, పవర్ లూమ్‌లకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని ఆగస్టు 7న చేనేత దినోత్సవం రోజున చంద్రబాబు హామీ ఇచ్చి అదే రోజు నుంచి అమలు కానుందని ప్రకటించారు. గోదావరి జిల్లాల్లో వంద యూనిట్ల వరకు ఈ పథకం అమలు అవుతున్నప్పటికీ మిగిలిన జిల్లాల్లో అమలు కావడం లేదు. కరెంటు సబ్సిడీ మాట అటుంచి విద్యుత్ ఛార్జీలను మాత్రం విపరీతంగా పెంచారు. 2017 నుంచి సహకార సంఘాలకు, చేనేత కార్మికులకు వివిధ పథకాలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా రూ.177 కోట్లు బకాయిలను ప్రభుత్వం పెండింగులో ఉంచింది. 2018 నుంచి ఆప్కోకు పాలక వర్గం ఏర్పాటు కాలేదు. దీంతో, అధికారుల ఇష్టారాజ్యంగా మారిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# నవ శకానికి స్వాగతం !



**న్యూయార్క్ :** మేయర్ ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం మద్దతుదారులను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో మమ్దానీ, భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ మాటలను గుర్తు చేసుకున్నారు. నవ శకానికి స్వాగతం పలుకుతున్నామంటూ ఆనాడు నెహ్రూ చేసిన వ్యాఖ్యలను ఆయన ఉటంకించారు. నవశకం వైపు అడుగువేసినప్పుడు. ఒక శకం ముగిసినప్పుడు.. సుదీర్ఘ అణచివేతకు గురైన జాతి నుంచి గళం వినిపించినప్పుడు.. చరిత్రలో ఇలాంటి క్షణాలు అరుదుగా వస్తాయి అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ తీర్పు మార్పుకు సంకేతమన్నారు. భవిష్యత్తు మన చేతుల్లో వుందన్నారు. 'మిత్రులారా%మనం ఒక రాజకీయ రాజవంశాన్ని కూలదోశామని మమ్దానీ వ్యాఖ్యానించారు. ట్రంప్ మోసం చేసిన ఈ దేశానికి ఆయనను ఎలా ఓడించాలో చూపించాలంటే అది ఆయనను పెంచి పోషించిన ఈ నగరమేనని అన్నారు. క్యూమో వ్యక్తిగత జీవితం బాగుండాలని మాత్రమే నేను కోరుకుంటున్నానని అన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చునని న్యూయార్క్ వాసులు భావించినందునే తాను ఈ విజయం సాధించానని చెప్పారు. డెమొక్రటిక్ ప్రైమరీ ఎన్నికలలో క్యూమోను మమ్దానీ ఓడించిన విషయం తెలిసిందే. అనేక మంది ప్రముఖులు క్యూమోను సమర్థించినా చివరకు ఆయనకు ఓటమి తప్పలేదు. ఎన్నికలకు ముందు క్యూమోకు ట్రంప్ బహిరంగంగా మద్దతు ప్రకటించారు. 'మీరు ఇదంతా చూస్తున్నారని నాకు తెలుసు. నేను మీకు నాలుగు మాటలు చెప్పాలని అనుకుంటున్నా. వాల్యూమ్ పెంచండి' అని ట్రంప్‌ను ఉద్దేశించి మమ్దానీ చురకలు వేశారు. న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన మమ్దానీ తన విజయంతో అనేక రికార్డులను చెరిపేశారు. 1892 తర్వాత నగర మేయర్‌గా ఎన్నికైన పిన్న వయస్కుడు ఆయనే. తొలి ముస్లిం మేయర్, ఆఫ్రికాలో జన్మించి అమెరికా నగరానికి మేయర్ అయిన తొలి వ్యక్తి కూడా ఆయనే. క్వీన్స్ అసెంబ్లీ సభ్యుడైన 34 సంవత్సరాల మమ్దానీ గత సంవత్సరమే మేయర్ రేసులో అడుగు పెట్టారు. అప్పుడు ఆయనకు పెద్దగా గుర్తింపు కూడా లేదు. ధన బలమూ తక్కువే. పార్టీ మద్దతు కూడా లేదు. అయినప్పటికీ మాజీ గవర్నర్ క్యూమో, రిపబ్లికన్ అభ్యర్థి లిండ్సేలను మట్టి కరిపించారు. అన్నింటికంటే ముఖ్యంగా డెమొక్రటిక్ పార్టీలోని చాలా మంది కోరుకుంటున్న నాయకత్వ లక్షణాలు ఆయనలో కన్పించాయి. వివిధ అంశాలపై సామాజిక మాధ్యమాలలో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు పలువురిని ఆకర్షించాయి.




# నాలుగో టీ 20లో భారత్ ఘన విజయం



ఆస్ట్రేలియాతో జరిగిన నాలుగో టీ20లో 48 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది. దీంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 2-1 ఆధిక్యంలో వెళ్లింది. భారత్ నిర్దేశించిన 168 పరుగుల లక్ష్యాన్ని చేధించలేక ఆసీస్ చతికిలపడింది. 168 పరుగుల లక్ష్య చేధనలో ఆసీస్ 18.2 ఓవర్లలో 119 పరుగులకే కుప్పకూలింది. ఆస్ట్రేలియా ఓపెనర్లు మిచెల్ మార్ష్(30), మాథ్యూ షార్ట్(25) ఘనమైన ఆరంభాన్ని ఇచ్చినప్పటికి మిడిలార్డర్ విఫలం కావడంతో ఆసీస్ ఓటమి చవిచూడాల్సి వచ్చింది.టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 167 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన ఆసీస్ కు మిచెల్, మాథ్యూ రూపంలో మంచి ఆరంభం దొరికింది. అయితే భారత స్పిన్నర్ అక్షర్ పటేల్ బంతితో మ్యాజిక్ చేశాడు. దీంతో మిడిలార్డర్ విఫలమైంది. అక్షర్ పటేల్ తన నాలుగు ఓవర్ల కోటాలో కేవలం 20 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు కీలక వికెట్లను పడగొట్టాడు. అక్షర్ దూకుడుగా ఆడుతున్న మాథ్యూ షార్ట్‌ను ఔట్ చేసి భారత్‌కు తొలి వికెట్‌ను అందించాడు. వాషింగ్టన్ సుందర్ మూడు వికెట్లను పడగొట్టాడు. అక్షర్ తో పాటు శివమ్ దూబే రెండు వికెట్లు తీశాడు. అలానే వరుణ్ చక్రవర్తి, బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ తలా వికెట్ తీసి.. భారత్ విజయం కీలక పాత్ర పోషించారు. భారత బ్యాటర్లలో శుభ్‌మన్ గిల్ పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కానీ అతడు 120 కంటే తక్కువ స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. మొత్తంగా ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ లో భారత్ 2-1 తేడాతో ఆధిక్యంలో ఉంది.

# దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్..

# భారత జట్టును ప్రకటించిన బీసీసీఐ



దక్షిణాఫ్రికాతో స్వదేశంలో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ గాయం నుంచి కోలుకుని తిరిగి జట్టులోకి రాగా, అతడికి వైస్ కెప్టెన్సీ బాధ్యతలు కూడా అప్పగించారు. ఈ సిరీస్‌లో భాగంగా తొలి టెస్ట్ నవంబర్ 14 నుంచి కోల్‌కతాలో, రెండో టెస్ట్ నవంబర్ 22 నుంచి గౌహతిలో జరగనుంది. గౌహతికి టెస్ట్ వేదికగా ఇది తొలిసారి కావడం విశేషం.

ఇంగ్లండ్‌తో జూలైలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో పాదం ఫ్రాక్చర్ కావడంతో పంత్ జట్టుకు దూరమయ్యాడు. వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌కు కూడా అతను అందుబాటులో లేడు. అయితే, ఇటీవల సౌతాఫ్రికా-ఎ జట్టుతో జరిగిన నాలుగు రోజుల మ్యాచ్‌లో ఇండియా-ఎ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి, పంత్ తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్నాడు. ఆ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో 90 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో సెలక్టర్లు అతడిని తిరిగి జట్టులోకి ఎంపిక చేశారు. పంత్ రాకతో ఎన్. జగదీశన్‌కు జట్టులో స్థానం దక్కలేదు.

పంత్‌తో పాటు యువ ఫాస్ట్ బౌలర్ ఆకాశ్ దీప్ కూడా టెస్ట్ జట్టులోకి తిరిగి వచ్చాడు. ఇంగ్లండ్ పర్యటన తర్వాత వెన్నునొప్పి కారణంగా రిహాబిలిటేషన్‌కు వెళ్లిన అతను, ఇటీవల ఇరానీ కప్, రంజీ ట్రోఫీ మ్యాచ్‌లలో పాల్గొని ఫామ్ అందుకున్నాడు. ప్రసిద్ధ్ కృష్ణ స్థానంలో ఆకాశ్ దీప్‌కు అవకాశం కల్పించారు.

ప్రస్తుతం ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత్ 61.90 శాతం పాయింట్లతో మూడో స్థానంలో ఉండగా, దక్షిణాఫ్రికా 50 శాతం పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. ఈ టెస్ట్ సిరీస్ అనంతరం ఇరు జట్ల మధ్య మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు కూడా జరగనున్నాయి. ఇదే సమయంలో, సౌతాఫ్రికా-ఎ జట్టుతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడనున్న ఇండియా-ఎ జట్టును కూడా బీసీసీఐ ప్రకటించింది. ఈ జట్టుకు తెలుగు ఆటగాడు తిలక్ వర్మ కెప్టెన్‌గా, రుతురాజ్ గైక్వాడ్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. నవంబర్ 13, 16, 19 తేదీల్లో రాజ్‌కోట్‌లోని నిరంజన్ షా స్టేడియంలో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి.

**భారత టెస్ట్ జట్టు**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషభ్ పంత్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీశ్ కుమార్ రెడ్డి, మహ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, ఆకాశ్ దీప్.




# ఏప్రిల్ 3న రాబోతున్న 'ఫంకీ'



వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయకుడు విశ్వక్ సేన్. హాస్య చిత్రాలకు చిరునామాగా మారిన దర్శకుడు కె.వి. అనుదీప్ . వీరిద్దరి కలయికలో రూపొందుతోన్న చిత్రం 'ఫంకీ' . ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ మూవీ రిలీజ్ డేట్ వచ్చేసింది. ఇటీవల విడుదలైన టీజర్‌కు ప్రేక్షకులు ఇచ్చిన అద్భుతమైన స్పందనతో ఉత్సాహంలో ఉన్న 'ఫంకీ' చిత్ర బృందం, ఈ సినిమాను 2026 ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తాజాగా ప్రకటించింది. టీజర్ తో వినోదాల విందుకి హామీ ఇచ్చిన ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. అందరూ అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న వినోదభరిత చిత్రాలలో ఒకటిగా 'ఫంకీ' ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. 'ఫంకీ' సినిమా కోసం స్వచ్ఛమైన వినోదాన్ని అందిస్తూ, ప్రేక్షకులను నవ్వులతో ముంచెత్తే అద్భుతమైన బృందం ఒకచోట చేరింది. దర్శకుడు కె.వి. అనుదీప్ తన శైలి కామెడీ విందుతో తిరిగి రాబోతున్నాడు. ఈసారి రెట్టింపు నవ్వులతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడానికి సిద్ధమవుతున్నాడు. అనుదీప్ దర్శకత్వం అంటే వినోదం ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. 'జాతిరత్నాలు' సినిమాతో సంచలనాలు సృష్టించిన ఆయన.. మరోసారి విభిన్నమైన కథాంశం, కట్టిపడేసే హాస్యంతో ప్రేక్షకుల మనసు దోచు కోబోతున్నారని నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య చెబుతున్నారు.

'ఫంకీ' చిత్రంలో విశ్వక్ సేన్ సినీ దర్శకుడి పాత్రను పోషిస్తుండటం విశేషం. కొత్త లుక్, కొత్త యాటిట్యూడ్‌తో ప్రేక్షకులను సరికొత్తగా అలరించనున్నాడు మాస్ కా దాస్. ఇప్పటికే టీజర్‌లో ఆయన నటన, ఎనర్జీ, కామెడీ టైమింగ్ కి ప్రశంసల వర్షం కురిసింది. ఈ సినిమాలో కయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం ఈ చిత్రానికి అదనపు ఆకర్షణగా నిలవనుంది. ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించిన నిర్మాణ సంస్థల నుంచి వస్తున్న సినిమా కావడంతో, 'ఫంకీ'పై సహజంగానే అంచనాలు ఎక్కువగా ఉంటాయి. ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా 'ఫంకీ' చిత్రం ప్రేక్షకులకు నవ్వుల విందుని అందిస్తుందని చిత్ర బృందం హామీ ఇచ్చింది.

## నిధి చుట్టూ తిరిగే కన్నడ కథ .. దూసుకుపోతున్న

# 'మారిగల్లు'

కన్నడ నుంచి ఈ మధ్య కాలంలో వచ్చిన సిరీస్ లకు విశేషమైన ఆదరణ లభిస్తోంది. తాజాగా ఆ జాబితాలోకి 'మారిగల్లు' కూడా చేరిపోయింది. దేవరాజ్ పూజారి దర్శకత్వం వహించిన సిరీస్ ఇది. అశ్వనీ పునీత్ రాజ్ కుమార్ నిర్మించిన ఈ సిరీస్, అక్టోబర్ 31వ తేదీ నుంచి 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతోంది. 6 ఎపిసోడ్స్ గా రూపొందిన ఈ సిరీస్, కన్నడలో మాత్రమే అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఈ సిరీస్ ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పై ఒక రేంజ్ లో దూసుకుపోతోంది. ఈ సిరీస్ ఇంతగా ఆకట్టుకోవడానికి కారణం కథాకథనాలు అనే మాట వినిపిస్తోంది. కదంబరాజుల కాలానికీ .. 1990ల నాటి కాలానికి మధ్యలో ఈ కథ నడుస్తుంది. ఈ రెండు కాలాలకి సంబంధించిన కథ ఆసక్తికరమైన కథనంతో ముందుకు వెళ్లడం ప్రేక్షకులను ఎక్కువగా ఆకట్టుకుంటోంది. కథకి తగిన లొకేషన్స్ .. పాత్రలకి తగిన ఆర్టిస్టులు .. సందర్భానికి తగిన లొకేషన్స్ ఈ సిరీస్ కి ప్రధానమైన బలంగా నిలిచాయని అంటున్నారు. లైటింగ్ .. నేపథ్య సంగీతం కూడా మెప్పిస్తున్నాయని అంటున్నారు.



కథ విషయానికొస్తే, దట్టమైన అడవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న గ్రామమే 'మారిగల్లు'. ఆ గ్రామస్తులు తమ గ్రామ దేవత 'మారి' పట్ల పూర్తి విశ్వాసంతో ఉంటారు. ఆ గ్రామంలో పెద్ద మనిషిగా చెలామణి అయ్యే మాస్టర్, ప్రాచీన శిలాఫలకాలను రహస్యంగా సేకరిస్తూ ఉంటాడు. అతని దగ్గరికి అప్పు కోసం వచ్చిన 'వరద' కంట ఆ శాసనాలు పడతాయి. అందులోకి ఒక శాసనాన్ని అతను తీసుకుని వెళ్లి, పురావస్తు శాఖకి చెందిన అధికారి ముందు ఉంచుతాడు. అది కదంబరాజుల కాలంలో దాచబడిన నిధి తాలూకు శాసనమని అతనికి అర్థమవుతుంది. అప్పుడు అతను ఏం చేస్తాడు? పర్యవసానాలు ఎలా ఉంటాయి? అనేది మిగతా కథ.




## కమల్ హాసన్ నిర్మాతగా

# రజనీకాంత్ 173వ చిత్రం



తమిళ చిత్ర పరిశ్రమలో ఓ అద్భుతం ఆవిష్కృతం కానుంది. దశాబ్దాలుగా వెండితెరపై తమ నటనతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన ఇద్దరు దిగ్గజాలు కమల్ హాసన్, రజినీకాంత్ ఇప్పుడు కొత్త పాత్రల్లో చేతులు కలపనున్నారు. సూపర్ స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా, లోకనాయకుడు కమల్ హాసన్ నిర్మాతగా ఓ భారీ చిత్రం రాబోతోంది. ఈ చారిత్రక ప్రాజెక్ట్‌ను కమల్ హాసన్ నిర్మాణ సంస్థ 'రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్' నిర్మించనుంది. ఈ సంచలన ప్రకటన వెలువడింది. రజినీకాంత్ 173వ చిత్రంగా రానున్న ఈ సినిమాకు సుందర్ సి దర్శకత్వం వహించనున్నారు. ఇది ఒక మాగ్నమ్ ఓపస్ చిత్రమని కమల్ హాసన్ తెలిపారు. ఈ విషయాన్ని తన ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించిన ఆయన, తన స్నేహితుడు రజినీకాంత్‌తో దిగిన ఫొటోను పంచుకున్నారు. తమ స్నేహాన్ని వర్ణిస్తూ ఓ తమిళ కవితను కూడా పోస్ట్ చేశారు.

"భారతీయ సినిమాలోని ఇద్దరు మహోన్నత శక్తులను ఈ ప్రాజెక్ట్ ఏకం చేయడమే కాకుండా, కమల్ హాసన్-రజినీకాంత్ మధ్య ఉన్న ఐదు దశాబ్దాల స్నేహానికి, సోదరభావానికి ఇది నిదర్శనం. వారి బంధం ఎందరో కళాకారులకు స్ఫూర్తినిస్తూనే ఉంది" అని రాజ్‌కమల్ ఫిలింస్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. తమ సంస్థ 44 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపింది.

రజినీకాంత్ అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్, సుందర్ సి దర్శకత్వ ప్రతిభ, కమల్ హాసన్ నిర్మాణ విలువలు ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళతాయని అభిమానులు అంచనా వేస్తున్నారు. ఈ చిత్రాన్ని రెడ్ జెయింట్ మూవీస్ సంస్థ 2027 సంక్రాంతికి ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనుంది. ఇటీవల రజినీకాంత్ సినీ పరిశ్రమలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కమల్ హాసన్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఏకంగా ఆయనతో సినిమా నిర్మిస్తుండటం కోలీవుడ్‌లో పండగ వాతావరణాన్ని సృష్టించింది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**